## దత్త జయంతి అంతరార్థము: ఉపవాసము అనగా

ఉపవాసము అనగా ఉప=స్వామి సమీపము నందు, వాసః=నివసించుట. అనగా స్వామి యొక్క గొప్పదనమును తెలుసుకొను సత్సంగములలోను, స్వామిపైనున్న ప్రేమను వ్యక్తము చేయు భజనలలోను నిమగ్నమై ఆహారమును అప్రయత్నముగా తీసుకొనకపోవుట ఇందులో ఆకలి కూడా స్ఫురణకు రాకపోవుట. అంతే కాని ఆకలి వేయుచుండగా జీవుని బాధించుకొనుట కానేకాదు. కొందరు అన్నమునకు బదులుగా అప్పచ్చులను తిని ఉపవాసమనుచున్నారు. ఇదే నిజమైనచో కేవలము గోధుమ రొట్టెలనే తిను ఉత్తర దేశీయులు నిత్యోపవాసులగుదురు. అన్నము అనగా నోటితో స్వీకరింపబడునది. అని అర్థము. అసలు ఉపవాసమునకును అన్నమునకును ఎట్టి సంబంధములేదు. ఏ రోజు స్వామి యొక్క సత్సంగములో నిమగ్నమై పోయి వంట చేయుటకు కూడా సమయము లేక భోజనమును అప్రయత్నముగావదలి వేయుదురో అదే ఉపవాసము. భగవంతునిలో లీనమగుట అంత ఉన్నత స్థాయికి పోలేక మధ్యలో అకలి అగుచో క్షీర ఫలాదులను స్వీకరింతురు. "పయో బ్రహ్మణస్య వ్రతమ్" అని శ్రుతి. అనగా బ్రహ్మజ్ఞాన సత్సంగములను చేయువారు మధ్య మధ్యలో క్షీరపానము చేయవలయునని అర్థము. దీనిచే శక్తి లభించును. మరియు పాలు సులభముగా జీర్ణమగుట వలన తమో గుణమైన మత్తురాదు. ఫలములు కూడా పాల వంటివే. ఆ విధముగా ఎవరు రోజంతయును సత్సంగములతో భజనలతో గడుపుదురో అట్టి రోజే "దత్త జయంతి".

## దత్త స్వరూపము - విశ్వమతము

దేవదేవుడైన దత్తుడు పవిత్ర సద్గుణవంతుడైన పండితునిగా దర్శనమిచ్చును. ఒక్కొక్క సారి మద్యపాన వేశ్యాలోలునిగా దర్శనమిచ్చును. దీని ద్వారా స్వామి సద్గుణవంతులు కాని దుర్గుణవంతులు కాని తనను చేరవచ్చునని సూచించుచున్నాడు. బ్రహ్మ రజో గుణము. విష్ణువు సత్త్వగుణము. శివుడు తమో గుణము. ఈ త్రిమూర్తుల ముఖములతో ఉన్న పరమాత్మ సర్వ గుణములతో చేరి ఉన్నాడని అర్థము. సగుణ బ్రహ్మము అనగా అన్ని గుణములతో చేరి ఉన్న బ్రహ్మము అని అర్థము. ఈ త్రిగుణములలో ఉన్న రజస్సు, తమస్సు దుర్గుణములు. అనగా ఎక్కువ (2/3 వంతు) దుర్గుణవంతులే అని తెలియుచున్నది. విష్ణువు సత్త్వ గుణము కావున వైష్ణవులు విష్ణువును అత్యధికునిగా తలచుచున్నారు. వీరు బ్రహ్మను తక్కువ గాను, శివుని రాక్షస దైవముగాను నిందించుచున్నారు. ఈ త్రిగుణములు అనగా త్రిమూర్తులు స్వామి యొక్క మూడు రంగు వేషములే. స్వామి ఈ మూడు గుణములచేతను అంటబడుట లేదు. వేదము విష్ణువే బ్రహ్మ, విష్ణువే శివుడని చెప్పుచున్నది. వేషధారియొక్క రంగు వేషములయొక్క రంగుల చేత మారుట లేదు.

సత్త్వము తెలుపు, రజస్సు ఎరుపు, తమస్సు నలుపు. కావున విష్ణువు తెల్లగాను, శివుడు నల్లగాను

ఉండవలయును. కాని వారి ఇరువురి రంగులు మారినవి. విష్ణువు నల్లగాను, శివుడు తెల్లగాను గాను ఉన్నారు. శివుడు సత్త్వగుణములతో శాంతముగా ధ్యానములో ఉన్నాడు. విష్ణువు తమోగుణముతో గోపికలతో క్రీడించుచున్నాడు. ఇప్పుడు చెప్పుము. ఎవరు గొప్ప? కావున త్రిమూర్తులలో ఉన్న దేవుడు ఒక్కడే. అతడే దత్తుడు. అతడు ఏ గుణములచేతను అంటబడడు. నిర్గుణ బ్రహ్మము అనబడుచున్నాడు. వస్త్రముల రంగుల వలన ఏ రంగూ లేని స్వామి ఎర్రగా, తెల్లగా, నల్లగా కనబడుచున్నాడు. ఈ దత్తస్వరూపము ద్వారా త్రిగుణములలో ఉన్న భక్తి గుణములచేత అంటబడదు అని చెప్పుచున్నది. భక్తి గుణముయొక్క రంగును కలిగినట్లుగా కనిపించుచున్నది. కాని భక్తి ఏ రంగూ లేక నిర్మలమైనది. అనగా సద్గుణవంతుడైననూ, దుర్గుణవంతుడైననూ మంచి మార్గము, లేక చెడు మార్గమున కాని భగవంతుని చేరవచ్చును. భక్తుని లోను మార్గములోను భక్తి ఉన్నప్పుడు అది ఏ గుణములను అంటని మహాశక్తి స్వరూపముగా ఉండును. తమోగుణములతో శివుడు తామసునిగా రాక్షసులను సైతము చెడు మార్గమున కూడా తనను చేరవచ్చునని సూచించుచున్నాడు. అట్లే సత్త్వగుణమగు విష్ణువు మంచివారుగా దేవతలు తనను సన్మార్గమున చేరవచ్చునని సూచించుచున్నాడు. అయితే విష్ణువే శివుడని మరచిపోకుము. రాక్షసులైనా, దేవతలైనా భక్తి సమానముగా ఉన్నచో ఒకే భగవంతుని చేరుచున్నారు. లోకశాంతికి భంగము కలిగించిన కారణమునకే స్వామి రాక్షసులను శిక్షించినాడు. స్వామి మూడు ముఖములు విశ్వముయొక్క సృష్టి, స్థితి, లయములను సూచించుచున్నవి. మూడు పనులను ఒకే ముఖము చేయుచున్నది అని వేదము చెప్పుచున్నది. కావున దత్తుడు పరబ్రహ్మము. త్రిమూర్తుల అవతారములగు మధ్వ, రామానుజ, శంకరులే గురుత్రయము. అనగా ఈ గురుత్రయమే గురుదత్తుడు. ఈ గురుత్రయము యొక్క మూడు భాష్యములలో ఉన్న ఏక సిద్ధాంతమే శ్రీదత్తవాణి.

దత్త భక్తి, ప్రతిఫలమును కోరక సత్యముగా, నిర్మలముగా ఉండవలయును. బిచ్చగాడు నీ దగ్గరకు వచ్చి నిన్ను పొగుడుచున్నాడు. నీవు వానిని పొమ్మనుచున్నావు. కాని నీ అతిథికి సర్వ సపర్యలను చేయుచున్నావు. ఇరువురిలో తేడా ఏమి? బిచ్చగాడు అన్నమును ఆశించి నీ వద్దకు వచ్చినాడు. అతిథి కేవలము నిన్ను చూచిపోవుటకు వచ్చినాడు. ఇరువురి లక్ష్యములు వేరు కావున వానిపై చూపబడిన నీ ప్రవర్తన కూడా వేరువేరగా ఉన్నది. కావున దత్తుని వద్దకు అతిథిగా రమ్ము. నీవు ఏ ప్రతిఫలమును ఆశించక దత్తుని వద్దకు వచ్చినచో అతిథికివలె నీకు దత్తుడు సర్వమునూ ఇచ్చును.

దత్త మతములోనికి ప్రవేశించిన తరువాత సాక్షాత్తు దత్తుడే నీకు జ్ఞానమును బోధించును. జ్ఞానము ద్వారా భక్తి కలిగి ఆ భక్తి నిస్వార్థమై కర్మఫలత్యాగముచే నిరూపితమైనచో దత్తకైవల్యము లభించును. ఈ మతములో ప్రత్యేకత ఏమనగా నీవు బ్రతికి ఉండగానే దత్తుడు నీలో లీనమై పోవును. అసలు దత్తుడు అనగా తనను తాను నీకు దత్తము చేసుకొన్న వాడని అర్థము. దత్తమతము సముద్రము వలె ప్రత్యేకముగా ఉన్ననూ ఇతర మతములను నదులలో ఉన్న జలమే. నదులన్నియును సముద్రములో చేరవలసినదే. దత్త దిగంబరుడు అనగా అన్ని పాత్రల వేషములు తీసి తన సహజమైన వేషములో ఉన్నవాడని అర్థము. అవధూత దత్త అనగా దత్తుని రుచి చూసినచో

సమస్త జీవులతో మరియు సమస్త వస్తువులతో ఉన్న నీ బంధములన్నియు తెగి విసిరి వేయబడునని అర్థము. దత్తుడనగా తన భక్తులయొక్క పాప ఫలములను అనుభవించుటకు ఒక మనుష్య శరీరమును ఆశ్రయించి తనను తాను భక్తునకు దానము చేసుకొన్నవాడని అర్థము. నీకు జరిమానా విధించినప్పుడు నీ ఆత్మీయుడగు నీ తండ్రి తాను కట్టి నిన్ను విడిపించును. పాపఫలములను నిజముగా అనుభవించవలయును. కావున దత్తుడు మనుష్య శరీరములను గ్రహించును. ఈ శిక్షను అనుభవించునప్పుడు తన శక్తిని ఉపయోగించి దత్తుడు బాధనుండి తప్పించుకొనడు. అట్లు తప్పించుకొన్నచో దత్తుడు ధర్మదేవుని మోసగించినట్లు అగును. కావున దత్తుడు ఆశ్రయించిన మనుష్య శరీరము బాధలను నిజముగా అనుభవించుటకై ప్రకృతి నియమములను అనుసరించి ఉండును. ఈ అనుభవము నిరంతరము ఉండును. కావున స్వామియొక్క శరీరము త్వరగా దెబ్బ తినుచున్నది. ఆయన దివ్య దర్శనములను ఇచ్చినప్పుడు మహావిద్యుచ్ఛక్తి ఆ శరీరమునో ప్రవహించును. దాని వలన ఆ శరీరము మరింత దెబ్బ తినుచున్నది. నీవు కొద్ది కర్మఫలమునే అనుభవించవలెను. ఆయన అనేక భక్తుల కర్మలను అనేక జన్మలనుండి అనుభవించుచున్నాడు. నీవు బాధతో విలపించవచ్చును. కాని ఆయన నవ్వుచుండవలెను. భక్త కర్మఫలములను అనుభవించుట ఒక్క క్షణము ఆపిననూ ఆ క్షణములో ఆయన దత్తుడు కాదు. నీవు సింహాసనమును చూచుచున్నావే కాని ముళ్ళను చూచుటలేదు. దత్తుడనగా ఆచరణము. బ్రహ్మము అనగా అఖండానంద స్వరూపమైన భావము. బ్రహ్మము కాగానే దత్తుడు కావలసిందే. అద్వైతులు బ్రహ్మమును గురించి తెలిసిన వారు. కానీ వారు దత్తుని గురించి తెలుసుకొన్నచో దత్తసేవకులుగనే ద్వైతములో ఉందురు. చూపులకు, స్పర్శకు సంభాషించుటకు కలసి మెలసి జీవించుటకు వీలుకాని పరమాత్మ వాటిని భక్తులకు అందచేయుటకు మనుష్యాకారమున తనను తాను భక్తులకు అందచేసుకున్న వాడే దత్తుడు. దత్త మతములో ప్రవేశించుటకు కావలసిన అర్హత అగు ''ప్రాణిగా పుట్టుటను'' ప్రతి మానవుడు కలిగియే ఉన్నాడు. ఇతర మతములలో విధించబడిన ప్రవేశార్హత అగు ''దుర్గుణములను వదలించుకొనుట'' ఏ మానవుడును ఇంతవరకు చేయలేదు. ఇది అసాధ్యము. కావున ఎన్నటికిని చేయలేరు. దీని అర్థము ప్రతి మానవుడునూ దత్తమతములోనికి పుట్టగానే ప్రవేశించియున్నాడు. మరియు ఇతర మతములలోనికి ఎన్నటికినీ ప్రవేశించలేడు. నీవు నిజముగా ఏ మతములో ఉన్నావో అట్టి విశ్వమతముయొక్క పేరును నీకు జ్ఞాపకము చేయుచున్నాను.

## ''మానవ సేవయే మాధవ సేవ'' – సరియైన అర్థము.

''మానవ సేవయే మాధవ సేవ'' అను వాక్యము సరిగా అర్థము చేసుకొననిచో చాలా ప్రమాదకరము. అన్నము, వస్త్రము, ఔషధములను ఆర్తులకు ఇచ్చుటయే సేవ కాదు. ఆర్తుడు స్వామిచే విధించబడిన తన పూర్వపాప శిక్షలను అనుభవించుచున్నాడు. నీవు వాని పూర్వ పాపములను చూడలేదు. ఇప్పుడు శిక్షలను చూచి కరుణించుచున్నావు. నీవు వానికి శాశ్వత సహాయమును చేయలేవు. వానికి జ్ఞానము, భక్తిని దానము చేసి భక్తునిగా మార్చినచో వానికి భగవంతుడే శాశ్వత సహాయము చేయును. కావున అన్నాది దానమే సేవ కాదు. నీ అన్నమును భుజించినవాడు పాపములను మరల చేసినచో ఆ పాప భాగమును నీవు పొందెదవు. నీవు వానికి

అన్నాదులతో పాటు జ్ఞానమును, భక్తిని కూడా దానము చేసినచో అట్టి కార్యము దైవ కార్యము కావున నీవు చేసినది మానవ సేవయే. ధనవంతులకును జ్ఞానము, భక్తిని దానము చేయుము. దారిద్ర్యము అనగా డబ్బు లేకపోవుటయే కాదు. జ్ఞానము, భక్తి లేక పోవుట కూడా. అన్న దానము ఈ దేహముతో నశించుచున్నది. జ్ఞానము, భక్తి లేనిచో జీవుడు శాశ్వతముగా పశు-పక్షి జన్మలయందు పడుచున్నాడు.

ఈ వాక్యము యొక్క అసలు అర్థము వేరు. మానవుడు మాధవునిగా అవతరించినప్పుడు మానవునిగా కనిపించును. అట్టి వానిని ఆయన స్వభావమైన ఆనందప్రదమైన జ్ఞానము చేత గుర్తించి ఆయనను సేవించినచో అట్టి ఆ మానవుని సేవ మాధవ సేవ అగునని అర్థము. స్వామి కృష్ణునిగా అవతరించినప్పుడు ఆయనను కొందరు మానవునిగా, మరికొందరు మాధవునిగా భావించినారు. కావున ఇది ఒక క్లిష్ట సమస్య అయినది. కరెంటు, లోహపు తీగను వ్యాపించినట్లు మాధవుడు ఆ మానవ శరీరమును వ్యాపించినాడు. కరెంటు, తీగవలె మానవుడు, మాధవుడు ఇద్దరు ఉన్నారు. ఈ సమస్యను శంకరాచార్యులు చర్చించి ఇద్దరూ ఉన్ననూ ఒక్కరే ఉన్నట్లు గ్రహించవలయునని అద్వైత సిద్ధాంతమును చేసినారు. కరెంటు, తీగ రెండూ ఉన్ననూ తీగను ఎచ్చట తగిలిననూ కరెంటు షాకు కొట్టుచున్నది. కావున తీగయే కరెంటు. ఈ విధముగా అవతరించిన మానవ శరీరమే మాధవుడు. కృష్ణుని స్పృశించినచో పరమాత్మను స్పృశించినట్లే. కాని ఈ సిద్ధాంతమును మానవులు వక్రముగా సర్వ మానవులకు విస్తరించి మానవుడే మాధవుడు అన్నారు. అందుకే శంకరులు కరిగిన సీసమును తాగి శిష్యులను కూడా తాగమని సత్యమును బోధించినారు. అనగా శంకరులే దైవము. కాని శిష్యులు కారని నిరూపించినారు. ప్రతి మానవుడు మాధవుడైనచో ఇంక ఈ సాధన ఎందులకు? అనగా మాధవునకు మోక్షము కావలయునా? ప్రహ్లాదుడు తన తండ్రిని కూడా మాధవునిగా ఏల అంగీకరించలేదు? నరసింహుడు హిరణ్యకశిపుడు ఇరువురును మాధవులే అయినచో నరసింహుడు హిరణ్యకశిపుని చంపినప్పుడు మాధవుని చంపినందున మాధవుడు ఆత్మహత్య చేసుకున్నాడా?

## గురుపూర్ణిమ సాయంకాల సందేశము

ప్రపంచములో ప్రతి మతము నీ దుర్గుణములను పూర్తిగా పోగొట్టుకున్న కాని ఆ మతములో చేరుటకు పనికిరావని చెప్పుచున్నది. ఇది ఆచరణలో అసాధ్యమగుచున్నది. ఏలననగా ఈ దుర్గుణములు అనేక పూర్వ సంస్కారమ పర్వతములు. ఈ స్వల్ప మానవ జన్మ వీటిని కదలించుటకు సైతము చాలదు. ప్రయత్నముచేత కొంతవరకు వాటిని నిగ్రహించవచ్చును. ఈ దుర్గుణములు ఋషుల మనస్సులలో కూడా నిప్పురవ్వలవలే మెరయుచున్నవి. ఎవరైననూ తనలో ఏ దుర్గుణము లేదని చెప్పినచో అది పరవంచన మరియు ఆత్మవంచనయే. ఇట్టి అసాధ్యమైన పనిని ప్రతి మతము కోరుచున్నందున అందరికి ఈ మతములపై ప్రీతి నశించుచున్నది. మత ప్రవక్తలు మతమును ఆధ్యాత్మికమును కలిపి గందరగోళము చేసినారు. మతము విశ్వములో శాంతి

ధర్మములను స్థాపించుట. నీ దుర్గుణములు సజ్జనులను బాధించి, విశ్వశాంతికి భంగము కలిగించినచో స్వామి నిన్ను శిక్షించును. కావున పూర్తిగా తీసివేయుటకు సాధ్యము కాని నీ దుర్గుణములను కొంత నిగ్రహించుకొనుము. దీనితో మతము ఆగిపోవుచున్నది. కొన్ని మతములు ఇంతటితో ముగిసి, తరువాత భాగమగు ఆధ్యాత్మికమును అసలు బోధించుట లేదు.

ఇక ఆధ్యాత్మికము అనగా స్వామిని చేరుటకు చేయు సాధన. దీనిలో దుర్గుణములను నిగ్రహించవలసిన అవసరము కూడా లేదు. స్వామికి నీ దుర్గుణములను గురించి ఎట్టి ఆక్షేపణము లేదు. అవి సాధనకు అడ్డురావు. అంతేకాదు వీటిని స్వామి వైపు మరలించినచో అవి నీకు సాధనలో సాయపడును. సాధనలో సాయపడుటకే అన్ని గుణములను స్వామి సృష్టించినాడు. కావున గుణములను సృష్టించుటలో కల అసలు ముఖ్యోద్దేశము గ్రహించినచో నీకు సాయపడుచున్న ఏ గుణమునైననూ నిగ్రహించరాదు. ఎంతటి మూర్ఖుడైననూ సాయపడువానిని అడ్డుకొనడు. కావున ఏ గుణమైననూ సాధనలో సాయపడునప్పుడు సద్గుణమే అగును. అట్లు కానిచో దుర్గుణములగును. కావున ప్రపంచమువైపుకు మరలింపబడిన ఏ గుణమైననూ దుర్గుణమే. సాధనలో భక్తిని సంపాదించుటకు ప్రయత్నము చేయవలెను. కాని గుణములను నిగ్రహించుటకు, తొలగించుటకు కాదు. భక్తి, జ్ఞానము చేత లభించి వృద్ధి పొందును. బొంబాయి నగరము ఉన్నది అని తెలియగనె చూడగోరుదుము. కాని దాని విశేషములు ఇంకను తెలియు కొలదీ దానిని చూచు కోరిక వృద్ధి అగును. కావున జ్ఞానము పెరిగిన కొలదీ కోరిక లేక భక్తి పెరుగుచున్నది. కృష్ణుడు భూమిపై అవతరించి ఉన్నాడని రుక్మిణి ముందు తెలుసుకున్నది. నారదుని నుండి ఆ కృష్ణుని గురించిన విశేషములను మరీ మరీ తెలుసుకున్నకొలదీ కృష్ణునిపై ప్రేమ అపారముగ వృద్ధి చెందినది. నారదుడు అనగా జ్ఞానమును ఇచ్చువాడు అని అర్ధము. భక్తిచే భగవంతుడు లభించునని ''భక్త్యాత్వనన్యయా'' అని గీత చెప్పుచున్నది.

కావున దత్త మతములోనికి ప్రవేశించుటకు అర్హత: నీవు ఒక ప్రాణివై ఉన్నచో చాలును. ఎట్టి గుణములు ఉన్ననూ మృగములు సైతము దైవ ప్రేమల ద్వారా దైవమును చేరవచ్చును. ఏనుగు, సాలీడు, సర్పము కూడా శ్రీకాళహస్తిలో ముక్తిని పొందినవి. సర్పము చాలా దుష్టప్రాణి. దీని దుర్గుణములను వదులుకొమ్మని స్వామి దానికి బోధించలేదు. బోధించిననూ దానికి అర్ధము కాదు. అట్టి సర్పమునకే మోక్ష అర్హత ఉన్నప్పుడు ఒక దుష్ట మానవునకు ఏల అర్హత లేదు. మతములు విధించు ప్రవేశ అర్హతలో మానవులు నిరుత్సాహమును పొందిఉన్నారు. తల తెంచుకున్నకాని ప్రవేశార్హత లేదని ఒక సంస్థ చెప్పినచో ఆ సంస్థ లోనికి ఎవరు చేరగలరు? అట్లే మతములు దుర్గుణములను తొలగించుకొనుట అన్నది విధించినచో ఎవరికిని సాధ్యముకాదు. కాకున్న, లోకశాంతికి భంగము రాకుండా నిగ్రహించుకొన వచ్చును. అట్టి నిగ్రహము దత్తమతములో కూడా విధించబడియే ఉన్నది. కావున దత్తమతములో లోకశాంతి కొరకు నీ దుర్గుణములను నిగ్రహించుకొన్నచో, స్వామిని చేరు సాధనలో మాత్రము అవి అడ్డు కానందున, మరియు సాయపడుటవలన, సాధనలో వాటి నిగ్రహము కూడా అవసరములేదు.

సాధనలో సాయపడునట్లు దుర్గుణములను స్వామి వైపుకు ఎట్లు మరల్చవలయును? ప్రతి జీవునిలో కోట్ల జన్మల నుండి పేరుకుపోయిన ఆరు దుర్గుణములు ఉన్నవి. అవి కామ, క్రోథ, లోభ, మద, మోహ, మాత్సర్యములు. ఇందులో క్రోథ, లోభ, మద, మాత్సర్యములు రజో గుణములు. కామ, మోహ ములు తమో గుణములు. స్వామి వైపుకు దుర్గుణములను మరలించు విషయములో ఒక చిన్న ఉదాహరణ: సినిమా పాటలలో ఉన్న ప్రేమను ఆ పాటలలో చిన్న మార్పుల ద్వారా స్వామి వైపుకు మరలించ వచ్చును. ఆ పాటలలో ఉన్న మధురమైన శక్తి వంతమైన లయ, రాగములు నిన్ను స్వామి వద్దకు తీసుకొని పోవు వాహనములుగా మారుచున్నవి. ''చురాలియాహై తుమ్నే...'' అను సినిమా పాటను తీసుకొని సనమ్ అను శబ్దమునకు బదులు హరే శబ్దమును పెట్టుము. ఇప్పుడు నీ ప్రేమ మాధుర్యము అంతయును విష్ణువగు కృష్ణునిపై కేంద్రీకరించబడి ఉన్నది! చూచితిరా! ఒక సినిమా పిచ్చివాడు తన దుర్గుణములలో ఎట్టి మార్పులను చేయనవసరము లేకయే మహాభక్తునిగా మారినాడు. ఈ పాటను వాడు ప్రార్థనగా పాడుచున్నప్పుడు ఎట్టి బలవంతము లేక పాడును. బలవంతము లేని సహజమైన ఆరాధనయే సత్యము.

బిల్వాణుడు అను కవి ప్రియురాలి మైకములో పోవుచుండగా దారిలో ఉన్న ఒక ఋషికి తన కాలు తగిలినది. ఋషి ఆగ్రహించినాడు. అప్పుడు బిల్వాణుడు ఇట్లు అడిగినాడు: ''ప్రియురాలి మైకములో ఉన్న నాకు, నా కాలు నిన్ను తగిలినట్లు తెలియలేదు. భగవంతుని మైకములో ఉన్న నీకు ఎట్లు తెలిసినది?'' అప్పుడు ఋషి సంతసించి ఇట్లు చెప్పినాడు. '' నీ ధ్యానము అద్భుతము. కాని నీ లక్ష్యము మంచిది కాదు. నీ ప్రియురాలి స్థానములో కృష్ణుని ఉంచుకొన్నచో నా కన్న ముందు నీవు స్వామిని చేరుదువు''. ఆ క్షణమునుండి బిల్వాణుడు కృష్ణ భక్తునిగా మారి సంన్యాసి అయినాడు.

జ్ఞానము, కరుణ మెదలగు గుణములు సత్త్వగుణములు. అనగా సద్గుణములు. రజస్సు, తమస్సు అనునవి దుర్గుణములు. రుక్మిణి సత్త్వగుణము. సత్యభామ రజోగుణము. రాధ తమో గుణము. గుణముల వరకు చూచుకొన్నచో ఒకదాని కన్న మరియొకటి ఎక్కువ. కాని ఆ ముగ్గురిలో ఉన్న భక్తి తీవ్రతను చూచినచో రుక్మిణికన్న సత్యభామ, సత్యభామ కన్న రాధకు ఎక్కువ ఉన్నది. కావున మహాలక్ష్మి స్వరూపిణియగు రుక్మిణికి హృదయ స్థానమును, దానికన్న పై స్థాయి అగు మూతిపై వరాహఅవతారమున భూదేవి అగు సత్యభామకు స్థానమును, దాని కన్న పై స్థానముగా గోలోకమున తన తలపై రాధకు స్థానమును ఇచ్చినాడు. స్వామి భక్తికి విలువను ఇచ్చినాడే కాని గుణములకు కాదు. కామమును స్వామి సౌందర్యముపై అట్లే మోహమును స్వామి ప్రవర్తన ఎట్లు ఉన్ననూ స్వామి మీదనే ఉంచుము. మోహము అనగా గుడ్డి ఆకర్షణ. ఈ రెండు దుర్గుణములను పాత్రలలో రాధ తన ప్రేమను పోసినది. ఇక సాక్షాత్కరించలేదని కోపమును స్వామిపై చూపుము. సంసారమునకు కాలమును, శక్తిని వ్యయము చేయక దాచుటలో లోభివి కమ్ము. అవసరములకు కూడా ఖర్చు పెట్టని మహాలోభి గుణము కర్తవ్యయములకు సైతము కాలశక్తులను ఖర్చు చేయని మహాభక్తిగా

మలచవలయును. ''స్వామి భక్తుడను నాకేమి?'' అను ధైర్యములో మదమును మలచవలయును. మహాభక్తులను చూచి మాత్సర్యము పొంది నీ భక్తిని పెంచుకొనవచ్చును. ఈ నాలుగు దుర్గుణములను పాత్రలలో దైవప్రేమను సత్యభామ పోసినది.

## గురుదత్తుని పొందే మార్గము

"సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" అని వేదము. స్వామి సత్యమైన అనంతమైన బ్రహ్మము అని చెప్పుచున్నది. స్వామి అంటే గురు దత్తుడే. నీకు ఇష్టమైననూ, కాకున్ననూ దత్తుడు సత్యమునే భోధించును. ఇందుకే ఇంతవరకు దత్తుడు ప్రసిద్ధికి రాలేదు. అయితే ఇప్పుడు ప్రసిద్ధికి వచ్చుచున్నది. కారణమేమనగా ఈ మధ్య ప్రజలు సత్యము యొక్క విలువను గుర్తించుచున్నారు. సత్యము యొక్క ఫలము నిజముగా, శాశ్వతముగా యుండును.

సాధారణముగా దేవునితో జనులు వ్యాపార సంబంధమును పెట్టుకుంటారు. ఒక సమస్య పరిష్కారమనకు గానీ, ఒక లాభమును పొందుటకుగానీ, స్వామి వద్దకువచ్చి, ముడుపులను అనగా లంచమును యిస్తామని మొక్కుకొనుచున్నారు. దానిలో కూడ ఇప్పుడు తెలివి ముదిరిపోయినది. తిరుపతిలో దేవునితో ''ముందు ఈ పని చేసిపెట్టుము పని జరిగిన తరువాత యీ పూజను చేయించెదను, లేక ఇంత డబ్బుయిచ్చెదను" అనుచున్నారు. అనగా పనికి ముందే డబ్బును ఇచ్చుటకు దేవుని కూడా శంకించుచున్నారు. ఇది అసలు దేవుని అస్తిత్వమునే అనుమానించుట అగుచున్నది. మరియొక మార్గము ఏమనగా బిచ్చగాడు అన్నము కొరకు యాచించినట్లు, దేవుని ధ్యాన, స్తుతులతో యాచించుట. ధనవంతుడైన భక్తుడు యీ మార్గములో యిట్లు దేవుని యాచించుటలో వాని ఆలోచన అంతరాంతములలో వానికి తెలియక ఇట్లు దాగియున్నాది. ఆ ఆలోచన ఏమనగా "దేవుడున్నాడో లేడో తెలియదు. ఉంటే, స్తోత్రములతో ప్రసన్నుడిని చేసుకుంటాను. ఒక వేళ లేకుంటే నాపని నా శక్తి చేతనే జరిగి ఉండి, దానిని దేవుడు చేశాడని భ్రమపడి దేవునికి డబ్బు యివ్వవలసి వచ్చును". ఇట్టి ఆలోచన వాని మనస్సులో ఉన్నట్లు వాడు అంగీకరించడు. ఏలననగా ఈ భావము చాలా సూక్ష్మరూపములో ఉంటుంది. కావున మనస్సు గ్రహించలేదు. కావున ఆ భావము తనలో లేదనుకుంటాడు. కాని దత్తుడికి ఎంత సూక్ష్మమైనా తెలుస్తుంది. బిచ్చగాడి పద్ధతిలో పేదవాడు భగవంతుని యాచించుటలో తప్పు లేదు. కాని ధనవంతుడు అట్లు యాచించుట నీచము.

స్వామికి గురుదక్షిణ రూపంలో ధనమును అర్పించుట నిజముగా సత్యమైన ప్రేమకు పరిక్ష. ఇదే క్రియాత్మకమైన కర్మఫల త్యాగము. నీవు నీ భార్యా పుత్రులను నిజముగా ప్రేమించుచున్నావు. కాన వారికి నీ ధనము నిచ్చుచున్నావు. స్వామిని కూడా నిజముగా ప్రేమించుచున్నచో స్వామికి నీ ధనము నిత్తువు. నీ కర్మఫలమగు ధనమను త్యజించుటయే గీతలో ఘోషించబడిన కర్మఫల త్యాగము. ఐతే స్వామి నుండి

సాయమును కోరుచూ లంచముగా గురుదక్షిణ ఇచ్చుట నీచము. ఈశావాస్య ఉపనిషత్తు మొదటి మంత్రములో ఈ ధనమంతయును స్వామిది. నీకు కావలసిన కనీస ధనమును తీసుకొనుము. నీవు ఎక్కువ తీసుకున్నచో స్వామికి తిరగి యిచ్చివేయుము. వేదము మరియు ఇట్లు బోధించినది. "సిగ్గుపడుతూ, భయపడుతూ ఇమ్ము". ఏలననగా స్వామి అనుమతించని ధనమును దొంగిలించినావు. కావున గురు దక్షిణను ఎట్టి ప్రతిఫలమును కోరకుండా స్వామికి సమర్పించవలెను. లేనిచో ఆ దొంగిలించిన ధనము నీకు కష్టములను తెచ్చును.

వేదము "శ్రద్ధయా దేయం"అని, అనగా గురుదక్షిణను ప్రేమతో ఇమ్మని చెప్పు చున్నది. ఇది చాలా ఉత్తమమైన పద్ధతి. దీని ద్వారా స్వామితో నిత్యసంబంధము ఏర్పడుచున్నది. ఇందులో లెక్క ఉండదు. నీ ధనమును నీ పుత్రునకు ఇచ్చుచున్నావు. అతడు నీకు సేవ చేయుచున్నాడు. ధనము ఎంత? సేవ మూల్యము ఎంత? రెండు సమముగా అయినవా? లేదా? అను ప్రశ్నలు రావు. వానికి నీవీయ గలిగినంత ధనము నిచ్చినావు. వాడు నీకు తాను చేయగలిగినంత సేవ చేసినాడు. అలాగే నీ వీయ గలిగినంత గురుదక్షిణ స్వామికి ఇచ్చినావు. స్వామి నీకు అవసరము వచ్చినప్పుడు నీకెంత అవసరమో అంత వరకు సాయపడును. ఇందులో లెక్కలుండవు. శ్రీ కృష్ణుని వేలు కోసుకున్నది. వెంటనే ద్రౌపది తన చీరను చింపి వ్రేలికి కట్టినది. స్వామికి కావలసినది ఆ సమయములో ఆ చీర ముక్క మాత్రమే. అది ఆమె స్వామికి ప్రతి ఫలాపేక్ష లేకుండా సమర్పించిన గురుదక్షిణ. కావున దానిని గురించి మరచి పోయినది. దుశ్శాసనడు తన చీరెలను లాగు చున్నపుడు కూడా దాని విషయమును ప్రస్తావించలేదు. ఆ విషయమును ప్రస్తావించి యున్నచో, వడ్డీతో కలిపి ఒక చీర వచ్చి యుండెడిది. కాని ఆ సమయమున ఆమెకు అనంత సంఖ్యలో చీరెలు కావలెను. ప్రతి ఫలాశలేని సేవకు అనంత ఫలము ఉండును. ఏలననగా ఆ సత్య బంధంలో లెక్క ఉండదు కావున స్వామి ఆ చీరె ముక్కను అనంత సంఖ్యలో చీరెలుగా మార్చి అందచేసినాడు. ప్రేమలో అవసరమే కాని లెక్క కూడదు.

## గణేష చతుర్థి నాటి దివ్యవాణి (21.8.2001)

శ్లో|| ఇంద్రియా దీనాం అగ్రాహ్యం బ్రహ్మ
కించిత్ గ్రాహ్యం ఆశ్రిత్య విద్యుత్
తంత్రీవ అద్వైతం వర్తతే||

తాత్పర్యం: ఇంద్రియాదులకు అందని పరబ్రహ్మము వాటికి అందు ఒకానొక పదార్థమును ఆశ్రయించి తీగ యందు వ్యాపించిన కరెంటు వలె దాని కన్న వేరు కాక అద్వైతమై యుండును.

శ్లో|| "ఇహ చేత అవేదీక్ అథ సత్య మస్తి
న చేత్ ఇహవేదీత్ అవేదీత్ మహతి వినష్టిః

ఇహ చేదవేదీ దథ సత్య మస్తి నచేది వావేదీ న్మహతీ వినిష్టిః" అని శ్రుతి

దీనిని గ్రహించి మనుష్య శరీరమును ఆశ్రయించిన పరబ్రహ్మమును బ్రహ్మముగా గ్రహించి ఉపాసించియు, వారు మరల తమ శరీరముతో సమానమైన మనుష్య శరీరము పై గల మాత్సర్యముతో మరల అద్వైతమును వదలి ద్వైతముగా చూచి అపార్ధమును ఆశ్రయించి ఆ నరావతారుని అవమానింతురు. ఇదే గీతలో శ్రీ కృష్ణభగవానుడు చెప్పినది.

శ్లో|| అవజానంతి మాం మూఢా మానుషీం తను మాశ్రితమ్
పరం భావ మజానన్తో మమ భూత మహేశ్వరమ్||

తాత్పర్యము: నా పరతత్త్వమును తెలియని మూఢులు, సర్వ భూతములకు ప్రభువును మానవదేహమును ఆశ్రయించిన నన్ను అవమానించు చున్నారు. మనుష్య శరీరమును ఆశ్రయించిన పరమాత్మను గ్రహించినవాడే నిజముగా పరమాత్మను పొందుచున్నాడు. ఇంత కన్న వేరు మార్గము లేదు. కాన అట్టి నరాకారమును త్యజించిన వాడు మహానాశనమును పొందుచున్నాడు. బ్రహ్మము ఆశ్రయించు పదార్ధములలో శిలాది విగ్రహముల కన్ననూ సంభాషణ, సహవాసములను అనుగ్రహించు నరాకారమే పరిపూర్ణమైన ఆనందము నిచ్చును. కావున అత్యుత్తమము.

ఐతే పరబ్రహ్మమును గుర్తించు మార్గమేది? బ్రహ్మమును గుర్తించుటకు అష్టసిద్ధుల ప్రదర్శనము ప్రధానము కాదు. జ్ఞానమే పరబ్రహ్మమును గుర్తంచు లక్షణము. "సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ" జ్ఞాన సాగరుము ముందు అష్టసిద్ధులు అల్పాది అల్పములు. మండనమిశ్రుడు (సురేశ్వరులు) శ్రీ శంకరులను పరబ్రహ్మముగా గుర్తంచి జీవితాంతము శిష్యుడై సేవించుటకు కారణమేమి? అష్టసిద్ధుల ప్రదర్శనమా? కాదు. కాదు. ఆనాడు మండనమిశ్రుడు ఆబ్దీకము పెట్టుటకు జైమిని, వ్యాస మహర్షులను ఆ మంత్రణము చేయునప్పుడు, శంకరుల మూసియున్న తలుపులలోనుండి లోనికి ప్రవేశించుట అష్టసిద్ధుల ప్రదర్శనమే కదా! జైమిని, వ్యాసులకు ఆ ఆష్టసిద్ధులు క్రొత్తయా? వారేమి ఆశ్చర్యచకితులు కాలేదు. మరి మండనమిశ్రుడు ఆశ్చర్యచకితులైనారా? కాలేదు కాలేదు. పైగా "ఎవరు ఈ బోడి గుండు"అని శంకరులను సంబోధించినాడు గదా. కనుక పరబ్రహ్మమును గుర్తంచుటకు అష్టసిద్ధులు లక్షణము కానేకాదు. మరేమి? అంటే జ్ఞానమే లక్షణము. మండనమిశ్రుడు శ్రీ శంకరులతో 21 రోజులు నిర్విరామముగా జ్ఞాన చర్చ చేసి ఆనందించి, పరవశుడై, జైమిని, వ్యాసులు "భేష్ భేష్"అనగా ఆ జ్ఞానసముద్రములో మునక వేసి శంకరులను పరబ్రహ్మముగా గుర్తించి, శిష్యుడై సన్యసించి సురేశ్వరాచార్యులుగా జీవించియున్నంత కాలము శిష్యుడై సేవించితరించారు. కనుక జ్ఞానమే పరబ్రహ్మమును గుర్తించుటకు లక్షణము.

## గురుపూర్ణిమ దివ్య ప్రవచనము: కర్మఫలత్యాగము

ఈశావాస్య ఉపనిషత్తులలో మొదటి మంత్రము: "ఈ విశ్వమంతయు ఈశ్వర ధనము. నీకు అవసరమైన ధనమును మాత్రమే గ్రహించుటకు ఈశ్వరుడు అనుమతించియున్నాడు. దానికన్న ఎక్కువ తీసుకున్నచో స్వామికి తిరిగి ఇచ్చివేయమని" చెప్పుచున్నది.

గోపికలు తమ సర్వకర్మఫలమగు వెన్నను నరాకారమున ఉన్న కృష్ణునకు పెట్టి వారి పిల్లలకును పెట్టక అత్యుత్తమమైన గోలోకమును పొందినారు. ప్రారబ్ధ కర్మఫలమగు శరీరములను సైతము స్వామికి సమర్పించి ధర్మభంగమునకు, నరకమునకునూ భయపడక సర్వార్పణ త్యాగమును చేసి అత్యుత్తమ స్థితిని పొందినారు. వారు గురుదక్షిణగా స్వామికి అర్పించనిది ఏమున్నది?

స్వామి గోపికలతో ఉన్నాడె తప్ప పురుషులతో కలసి ఏల ఉండలేదు? అని స్వామిని స్త్రీ లోలునిగా నిందించుచున్నారు. దీనిలోని రహస్యమేమి? పురుషుడు అహంకార రజోగుణములతో ఉండును. స్త్రీ ఎప్పుడునూ వినయము, భయము మొదలగు సాత్త్వికమైన మోక్షగుణములతో ఉండును. అందుకే ఋషులు గోపికలుగా జన్మించినారు. ఏ జీవుడైనా ముక్తికి ముందు కడపటిజన్మగా స్త్రీ జన్మను పొందవలసినదే. అయితే దీని అర్థము ప్రతి స్త్రీ జన్మ చివరి జన్మ అని కాదు.

కన్నప్ప అను కిరాతుడు దేహములో ప్రధానమైన కన్నులను స్వామికి సమర్పించినాడు. అది అత్యుత్తమ గురుదక్షిణ. నీకు నీ కుటుంబమునకు కావలిసిన ధనమును ఆర్జించుకొనుటకు స్వామి అనుమతించును. నీవు ఎక్కువ తీసుకొన్నచో దానిని స్వామికి ఇచ్చివేయమని వేదము బోధించుచున్నది. నీవు మిత్రుని ఇంటికి పోయినప్పుడు కప్పుతో పాలను ఇచ్చినాడు. పాలను త్రాగుము. కాని కప్పును దొంగిలించకుము. దొంగిలించినచో నీవు దొంగవు పాపివి అగుదువు అని వేదము చెప్పుచున్నది. ఆ ఎక్కువ పాప ధనము నిన్ను కష్టముల పాలు చేయుచును. కొందరు భక్తులు వారి కనీస ధనమును కూడా మొత్తము లేక కొంత స్వామికి సమర్పించుచున్నారు. పాటిల్ పండించిన సంవత్సర ధాన్యమంతయు షిరిడీ సాయిబాబాకు తెచ్చి ఇచ్చి ఆయన ప్రసాదించినది తీసుకొని పోయెడివాడు. ఒక ధనికుడు బ్రహ్మ జ్ఞానమీయమని సాయిని వెంటబడగా సాయి నాకు కావలసిన ఐదు రూపాయలను నీ జేబు నుండి తీసి ఇవ్వలేనివాడవు నీవు బ్రహ్మమును ఎట్లు తెలుసుకొందువు? అని చెప్పినాడు. ఈ కర్మఫలత్యాగమును నేర్పుటకే సాయి అందరినీ గురుదక్షిణ అడిగెడివాడు.

అసలు స్వామికి నీ ధనము అక్కరలేదు. నీవు తీసుకొన్న పెచ్చు ధనమును ఇచ్చుటనే వదలి ఆ పాపముతో ఒక్కడవే పైకి పోవుచున్నావు. ఈ విశ్వమంతయును స్వామి ధనాగారమే. ఆయన ధనాగారములోనే నీవు తీసుకొనుట, అనుభవించుట, వదలివేయుటయు జరుగుచున్నది. నీవు దొంగిలించిన హెచ్చు ధనము నీ చేతులతో స్వామికి సమర్పించని పాపమును మాత్రమే మూటగట్టుకుని ఆ హెచ్చుధనమును ఇచ్చుటనే వదలిపోవుచున్నావు.

శబరి శ్రీరామునికి ఆమె ఆహారమగు రేగిపండ్లను సమర్పించినది. తిన్నడు వేటాడి తెచ్చిన పచ్చిమాంసమగు పాపధనమును శివునికి సమర్పించినాడు. శివుడే విష్ణువని వేదము. కావున ఇరువురు ఒక్కరినే చేరినారు. ఇరువురిలోను భక్తి తీవ్రత సమానముగ ఉన్నది. నీవు పాపధనమును సైతము గురుదక్షిణగా స్వామికి ఇచ్చినచో నీ పాపము లెక్కింపబడుటలేదు. పాపముతో సంపాదించిన వేట మాంసము తాను తినక స్వామికి అర్పించిన తిన్నడు ముక్తుడైనాడు. తాను భుజించిన, పాపమును పొందును.

తిరుపతిలో స్వామికి నీ కష్టములో సాయము లభించిన తరువాత ధనమును గురుదక్షిణగా ఇచ్చుచున్నావు. ఆ ధనము స్వామిదే. నీవు దొంగిలించిన పెచ్చుధనమే దానిని క్షమాపణ కోరుచూవాపసు చేయుటకు బదులు దానితో స్వామితో పనిచేయించుచున్నావు. పని చేసిన తరువాతనే డబ్బు ఇచ్చుట! నీ విశ్వాసము ఇది! నాస్తికులు కూడా డబ్బు ఇచ్చి ఇతరుల చేత పని చేయించుచున్నారు. వారి కన్న నీవు ఏమి ఎక్కువ? ఆ స్వామిలో వేషధారిగా ఉన్న గురుదత్తుడు ఈ రోజు మీరు దిద్దుకొనుటకై సత్య జ్ఞానమును బోధించుచున్నాడు.ఈనాడు గురుదత్తుడు స్వామి ధనమునుండి దొంగిలించిన పెచ్చుధనమును స్వామికి గురుదక్షిణగా సమర్పించి నీ పాపముల గొలుసునుండి విముక్తిని పొందవలెనని బోధించుచున్నాడు. నీవు ఒక దుకాణము నుండి దొంగిలించిన ధనమును ఇచ్చివేయవలెను. కాని దానితో ఏ వస్తువును దుకాణములో కొనరాదు. నీవు క్షమాపణ చెప్పి ఇంటికి పోయినచో దత్తుడు ప్రసన్నుడై నీ ఇంటిలో వంద వస్తువులు ఉండునట్లు చేయును.

పాలుతాగి దొంగిలించిన కప్పును ఆ కప్పుయొక్క యజమానికే ఇచ్చివేయవలెను. అలాగే స్వామికే సమర్పించవలెను. ఇదే గురుదక్షిణ. దీనిని సమర్పించినప్పుడు క్షమాపణ, భయము ఉండవలెను. కాని గర్వము ఉండరాదు. ''భియాదేయం'' అని వేదము. అనగా భయముతో స్వామికి ఇమ్మని అర్థము. ''సంవిదాదేయం'' అని వేదము. అనగా జ్ఞానముతో స్వామికి ఇమ్మని అర్థము. అనగా జ్ఞానము అను గుర్తుతో స్వామిని గుర్తించమని అర్థము. ''శ్రద్ధయాదేవం'' అని వేదము. అనగా స్వామిని గుర్తించువరకు ఓర్పుతో వేచిఉండమని అర్థము. దీని అర్థము కప్పును దాని యజమానికే ఇచ్చునట్లు సమస్త ధనమునకు యజమానియగు స్వామికే నీవు దొంగిలించిన ధనమును గురుదక్షిణగా ఇమ్మని అర్థము.

దానములో తొందర పనికిరాదు. సద్గురువు లభించువరకు ఓర్పుతో నీ ధనమును కూడబెట్టుకొనుచూ లభించగానే మొత్తమును గురుదక్షిణగా ఇమ్ము. ఆరోజే నిజమైన గురుపూర్ణిమ. ప్రతిరాత్రి ఒక్కొక్క కళతో చంద్రబింబము ఈనాటికి పూర్తి అగునట్లు నీవు కూడబెట్టిన ధనముతో నీ హుండి పూర్తి కావలయును. దానములో దేశము, కాలము, పాత్ర అను మూడు అంగములు ఉండును. పాత్ర చాలా ముఖ్యము. గురుపూర్ణిమ (కాలము) రోజు, కాశి (దేశము)లో దానము చేయుట ముఖ్యము కాదు. యోగ్యునకు (పాత్ర) దానము చేయుట ముఖ్యము. ఆ పాత్ర సద్గురువు అవునా? కాదా? అని నీవు విచారించుట లేదు. సద్గురువగు గురుదత్తుడు లభించినప్పుడు నీవు కూడబెట్టిన ధనమును గురుదక్షిణగా అర్పించిన ప్రదేశమే కాశి. ఆ రోజే నిజమైన గురుపూర్ణిమ.

సద్గురువు లభించనిచో దీనుడైన దత్తభక్తునకు దానము చేయుము. నారద భక్తి సూత్రము ‘‘తన్మయాహితే’’ ప్రకారముగా స్వామి అవతార పురుషునిలోనే కాక భక్తులలోను ఉన్నాడు. అయితే భక్తులలోను ఉన్నాడు. అయితే భక్తులలో స్వామి బోధించినది ఆ జీవుడు బోధించి ఆచరిస్తాడు. అప్పుడు దోషములు రావచ్చును. ఉదాహరణకు నీవు ఒక భక్త సమాజమునకు గురుదక్షిణ ఇచ్చితివి. దానితో వారు శివరాత్రినాడు కాశీలో వంద మందికి అన్న దానమును చేస్తారు. అయితే సద్గురువు, పాత్రుడైన ఒకనికి వంద రోజులు అన్న దానమును చేసి నీ గురుదక్షిణను పూర్ణ ఫలమిచ్చును. సద్గురువు విషయములో శరీరములో స్వామి ఒక్కరే ఉంటారు. కావున ఆయన బోధలో కాని, పనిలో కాని ఏ దోషము రాదు. షిరిడీసాయి వచ్చిన గురుదక్షిణలను బీద భక్తులకు ఇచ్చేవారు. సర్వజ్ఞుడగు ఆయనను ఎవరు మోసగించలేరు. బిచ్చగాళ్ళు నిన్ను మోసగించగలరు.

గురుదక్షిణలను ఇచ్చిన తరువాత దానిని సద్గురువు ఏమి చేయునని పరీక్షించరాదు. పూర్ణ విశ్వాసముతో ఇయ్యవలెను. ఆయనను సద్గురువుగా నిశ్చయించిన తరువాత మరల పరీక్ష ఏల? అగ్ని అని నిశ్చయించిన తరువాత దానలో మరల వేలు పెట్టి పరీక్షించరాదు. నీ విశ్వాసము పూర్ణము కానిచో కోతి పిల్ల తన తల్లి పొట్టను పట్టుకొన్నట్లు ఉండును. ఒక స్థలము నుండి మరియొక్క స్థలమునకు తీసుకొనిపోవు బాధ్యత మాత్రమే తల్లిది. పట్టు బాధ్యత పిల్లది. కావున పడిపోవచ్చును. ఇదే మర్కట కిశోర న్యాయము. విశ్వాసము సంపూర్ణమైనచో మార్జాల కిశోర న్యాయముగా పిల్లి తన పిల్లను నోట కరుచుకొని తీసుకొని పోవును. సాయిబాబా గురుదక్షిణ ఖర్చు గురించి ఏ ఒక్కరు సాయిబాబాను ప్రశ్నించలేదు. ఒక ఇన్ కంటాక్స్ అధికారి ప్రయత్నించి విఫలుడయ్యెను. కటిక పేదవాడగు మహల్సాపతికి సాయి ఏమియును ఇచ్చుట లేదని భక్తులు బాధపడినారు. సాయి మహల్సాపతియొక్క స్థిర భక్తిని పరీక్షించుచున్నాడని భక్తులకు తెలియదు. సాయము చేసినచో ఆ పరీక్ష పాడగును. పరీక్ష లేకున్నను నీ స్థితి స్వామికి తెలియును. కాని మీరు చాలా గొప్ప స్థితిలో ఉన్నట్లు ఊహాలోకమున విహరించుచున్నారు. స్వామి బోధించిననూ నమ్ముటలేదు. పరీక్షలలో నిరూపింపబడినకాని నమ్మరు. కావున దత్తపరీక్షలు నీశ్రేయస్సుకే కాని సర్వజ్ఞుడగు స్వామికొరకు కాదు. ఈ పూర్ణిమ చంద్రుడును మీరు కూడబెట్టిన ధనమునే కాదు, దానిని గురుదక్షిణగా ఇచ్చినప్పుడు మీకు ఉండవలసిన పూర్ణ విశ్వాసరూపమగు మనస్సును సూచించున్నాడు. చంద్రుడు ధనమును, మనస్సును కూడా సూచించున్నాడు. ‘‘చంద్రాంహిరణ్మయీం’’, ‘‘చంద్ర మామనసో’’ అని చెప్పుచున్నది. సాయి తనకు దక్షిణలను ఇచ్చువానిని నేరుగా తాను ఈయదలచుకున్నవారికి ఇప్పించి ఉండవచ్చును కదా! వీటిని తీసుకుని ఆయన రహస్యముగా పంచెడివాడు. అట్లు చేయుట ద్వారా తనకు గురుదక్షిణలను ఇచ్చిన వారి యొక్క పూర్ణ వాశ్వాసమును పరీక్షించెడివాడు.

## గురుపూర్ణిమ దివ్య ప్రవచనము: సద్గురువును గుర్తించుట

ఈనాడు మీరు అందరును ఈ దివ్య దత్త జ్ఞాన-భక్తి ప్రచార సేవకై నా చరణముల వద్ద గురుదక్షిణలను సమర్పించినారు. గురుపూర్ణిమ నాటి పూర్ణ చంద్రబింబము బంగారము లేక వెండి నాణెమును అనగా ధనమును సూచించుచున్నది. ఇది నీవు గురువుకు సమర్పించవలసిన గురుదక్షిణలను గుర్తుచేయుచున్నది. ప్రతి నెలా గురుదక్షిణనీయవలెనని ప్రతిపూర్ణిమ నీకు చెప్పుచున్నది. గురువు నరుడు కారాదు. అతడు నరరూపమున వచ్చిన నారాయణుడగు సద్గురువు కావలెను. అప్పుడే నీ గురుదక్షిణకు సద్వినియోగము జరుగును. ధనమే నీ సత్య ప్రేమను నిరూపించుచున్నది. నీవు ధనమును ఎవరికి ఇచ్చుచున్నావు? నీ సంతానమునకు ఇచ్చుచున్నావు. కావున నీ నిజమైన ప్రేమ నీ సంతానముపైనే ఉన్నది. అదియే చక్కని నిజమైన పరీక్ష. నీకు భగవంతునిపై అట్టి నిజమైన ప్రేమ ఉన్నచో నీవు ధనమును భగవంతునకే ఇచ్చెదవు. దీనిలో ఇంక వాదము లేదు. ఇది క్రియాత్మకమైన పరీక్ష. మనస్సుతో ధ్యానము, నోటితో స్తోత్రము నీ అసత్యమైన దైవ ప్రేమను ఇతరులకు సత్యమని చూపించు వంచనయే. అయితే కంచములో అన్నము ఉన్నచో పక్కన ఉన్న ఊరగాయ ముక్కలవలె ఈ ధ్యాన, స్తోత్రములు గురుదక్షిణలకు పక్కనే చేరి ఉన్నచో సార్థకములగును. ఈ గురుదక్షిణలే కర్మఫలత్యాగము అని గీతలో అడుగడుగనా ఘోషించబడినది. కర్మయొక్క ఫలమును ఆశించక దానిని ఈశ్వరార్పణము చేయుటయే కర్మఫల త్యాగము లేక గురుదక్షిణ. గురుదక్షిణ లేని ధ్యాన స్తోత్రములు కేవలము ఊరగాయ ముక్కలు మాత్రమే ఉండి అన్నము వడ్డించని విస్తరి వలే ఉండును. గురుదక్షిణ సార్థకము అగుటకు సద్గురువును గుర్తించవలెను. "సత్యం, జ్ఞానం" అని వేదము సద్గురువును సత్యమైన, అనంతమైన జ్ఞానముచేత గుర్తించవలయును అని చెప్పుచున్నది. నాలుగు వేదముల మహావాక్యములలో మొదటి మూడు వాక్యములు పరమాత్మ నావలె, నీ వలె, వాని వలె మనుష్యాకారమున ఉండునని చెప్పుచున్నవి. నాలుగవ మహావాక్యము అట్టి నరావతారుడు ఎట్టి నరులు చెప్పలేని విశేష జ్ఞానముతో ఉండునని పలుకుచున్నది. పండితులు చెప్పు జ్ఞానము తల నొప్పిని కలిగించును. అవతరించిన సద్గురువు చెప్పు జ్ఞానము మాత్రమే హృదయములోనికి చొచ్చుకొని పోయి ఆనందమును కలిగించుచున్నది.

ఆనందము బ్రహ్మమని వేదవాక్య ప్రమాణము. వేడిచేత అగ్నిని గుర్తించినట్లు ఆనందప్రదమైన జ్ఞానము చేత సద్గురువును గుర్తించవలెను. మహిమలు గుర్తులు కావు. రావణుడు మొదలగు రాక్షసులు సైతము మహిమలను ప్రదర్శించెను. మొండి బిడ్డలగు ఈ రాక్షసులు తపస్సు అను మొండి పట్టుదలద్వారా స్వామికి సొమ్ములవలెనున్న ఈ మహిమలను స్వామి నుంది పొందెదరు. వారు స్వామి నుండి జ్ఞాన గుణములను పొందలేరు. కావున వారు స్వామి కాలేరు. మహిమలచేత వారు దేవుడని ప్రకటించుకున్నను ఈ కారణమువలన ఋషులు అంగీకరించలేదు. ఈశావాస్య ఉపనిషత్తులలో మొదటి మంత్రము: "ఈ విశ్వమంతయు ఈశ్వర ధనము. నీకు అవసరమైన ధనమును మాత్రమే గ్రహించుటకు ఈశ్వరుడు అనుమతించియున్నాడు. దానికన్న ఎక్కువ తీసుకున్నచో స్వామికి తిరిగి ఇచ్చివేయమని" చెప్పుచున్నది.

[16.11.2002 శనివారము] జ్ఞానము త్రిపుటి స్వరూపముగా యుండును. గమ్యమును గురించిన జ్ఞానము, గమనమును గురించిన జ్ఞానము, గమనము చేయువాడగు జ్ఞాతను గురించిన జ్ఞానము. గమ్యము అనగా భగవంతుడు. అతడు నిరాకారుడా? సాకారుడా? లేక నరాకారుడా? ఇత్యాది విచారణయే జ్ఞేయము అనబడును. ఆ పరమాత్మను చేరు మార్గము జ్ఞానమా, భక్తియా, యజ్ఞయాగాదులా లేక ప్రాణాయామాది యోగమా? ఇత్యాది విషయములు మార్గ జ్ఞానము. ఇక గమనమును చేయు జీవుడు ఎవరు? ఈ శరీరమా? చైతన్యమా? బ్రహ్మ స్వరూపుడా? బ్రహ్మములోని అంశయా? బ్రహ్మము కన్న భిన్నుడా? ఇత్యాది విచారమే జ్ఞాత యొక్క జ్ఞానము. సర్వజ్ఞానము ఈ మూడింటికి సంబంధించియే యుండును. ఇందులో మొదటిది భగవంతుని గురించిన జ్ఞానము. భగవంతుడు ఎవరు? పురుషుడా? లేక స్త్రీ రూపమా? లేక తేజోరూపమా? భగవంతుని విషయములో భగవంతుని గురించి చెప్పిన వేదమే ప్రమాణము. ఆ వేదము యొక్క అర్థము యుక్తికి సమ్మతమై యుండవలెను. మరియును ప్రత్యక్షముగా అనుభవములోనికి రావలయును. శ్రుతి, యుక్తి, అనుభవ ప్రమాణమైనదే బ్రహ్మజ్ఞానము. వేదములో సర్వత్రా "సః పురుషః" ఇత్యాది శబ్ధములచేత పరమాత్మ పురుష స్వరూపముగనే చెప్పబడు చున్నది. మరియు ఆయన యొక్క శక్తి శక్తి మాయ, ప్రకృతి మొదలగు శబ్దములచే చెప్పబడు చున్నది. ఈ శబ్దములు స్త్రీలింగ శబ్దములే తప్ప స్త్రీ స్వరూపమును బోధించవు. ఒక కవిలోని కవితా శక్తి స్త్రీ స్వరూపము కాదు. ఇది వ్యక్తి యొక్క సామర్ధ్యము. అనగా గుణము. ఈ పరమాత్మ యొక్క సామీప్యము నందున్న స్త్రీ స్వరూపమును ఉమగా శ్రుతి చెప్పుచున్నది.

లోకములో పురుషుని స్త్రీ సేవించుచున్నది. కావున పరమాత్మ పురషుడుగాను, పరమాత్మ యొక్క సామర్ధ్యమైన మాయ శక్తిని నపుంసక లింగముగాను, పరమాత్మను సేవించు జీవుని స్త్రీగాను తీసికొనవలయును. జీవుడన్నపుడు జగత్తును కూడా తీసుకొనవచ్చును. జగత్తు అనగా ప్రకృతి. ప్రకృతి అనగా ప్రశస్తమైన కృతి. అనగా శ్రేష్ఠమైన కార్యము. ఈ ప్రకృతి అపరాప్రకృతి యను జడముగాను, పరాప్రకృతి యను చైతన్యముగాను రెండు భాగముల ఉన్నది. ప్రకృతి యనగా వ్యక్తమైన పరమాత్మ శక్తి. అనగా కార్యశక్తి. పరమాత్మలో అవ్యక్తముగా నుండి పరమాత్మ కన్న వేరు చేయలేని కారణశక్తియే మాయ. అగ్ని పరమాత్మ యైనచో కాల్చు గుణమే మాయ. బయిటకు వచ్చిన వెలుతురే ప్రకృతి. కవితా శక్తి మాయ. కావ్యము ప్రకృతి. పరమాత్మ యొక్క చిత్ర విచిత్ర నిర్మాణశక్తియే మాయ. చిత్ర విచిత్రముగా నిర్మింపబడన జగత్తే ప్రకృతి. ఈ పరమాత్మ యొక్క తత్వము వేదములకు సైతము అందరానిది. పరమాత్మను గురించి ఏమియు తెలియజాలమని తెలియుటయే జ్ఞానము అని "యస్య మతం తస్య మతం" అను శ్రుతి చెప్పుచున్నది. ఇతడు జ్ఞానస్వరూపుడై, ఆనందస్వరూపుడై, సకల కల్యాణ గుణ పరిపూర్ణుడై అనూహ్యమైన అనంతమైన మాహాశక్తి యొక్క ఘన స్వరూపమై యుండును. "ప్రజ్ఞాన ఘనః, తనూంస్వామ్, ఆదిత్య వర్ణం" ఇత్యాది శ్రుతులు ఇదే చెప్పుచున్నవి. పరమాత్మ నిరాకారుడన్న వాదము సరికాదు. కాంతి మొదలగు జడశక్తులు విడిగా కనిపించు చున్నవి కాని ఒక

వ్యక్తి ఆశ్రయము లేని చైతన్యము విడిగా లోకములో కనిపించుటలేదు. కావున చైతన్యమే బ్రహ్మము అనువారలు చైతన్యమునకు అధిష్ఠానమైన వ్యక్తిని అంగీకరించవలెను. దీనినే "బ్రహ్మ పుచ్ఛం ప్రతిష్ఠా" అని శ్రుతి చెప్పు చున్నది.

"అరూపమ్" మొదలగు శ్రుతులను పరమాత్మ నిరాకార స్థితిని చెప్పును. "ప్రత్యగాత్మాన మైచ్ఛత్" "పరి పశ్యంతి" అను శ్రుతులు పరమాత్మ సాకారుడని చెప్పుచున్నవి. అయితే ఈ పరమాత్మ యొక్క స్వస్వరూపమును ఈ చర్మ చక్షువులు చూడలేవు. ఆయన దివ్య దృష్టిని అనుగ్రహించగా ఈ చర్మ చక్షువులే దివ్య శక్తిని పొంది దివ్యనేత్రములై ఆయనను దర్శించగలవు. అర్జునుడు ఆయన నిజ స్వరూపమును దివ్య చక్షువులతోనే దర్శించగలిగెను. ఆ దివ్యస్వరూపము ముందు ఈ జగత్తు అత్యల్పము. సూర్యునిలో ఒక కిరణము. ఒక మానవునిలోని ఊహ ఆయన యొక్క ఊహయే ఈ జగత్తు. ఈ జగత్తులోను ఒక పరమాణువు అగు జీవుడు ఆయనను ఎట్లు దర్శించగలడు? ఒక వ్యక్తి యొక్క ఊహ అంతయు కలసిన ఆ వ్యక్తి యొక్క రోమమును కూడా కదిలించ జాలదు. కావున ఆయన ఊహయగు ఈ జగత్తు ఆయన యొక్క రోమమును కూడా కదిలించ జాలదు. గోవర్ధనమును ఎత్తిన శ్రీకృష్ణుడు ఈ విశ్వమంతయు నాపై పడిననూ నావేలు అల్లాడదు అని చెప్పినాడు. కావున అటువంటి మహాశక్తి సంపన్నుని చూచుటయే దుర్లభమైనప్పుడు, ధ్యానించుట అసంభవము. ఇక స్పర్శ కలలో మాట. ఇక సహవాస సంభాషణములా? ఊహించుటకును వీలుకాదు. ఆయన ఈ నిజ స్వరూపమును అవ్యక్త స్వరూపమందురు. దానిని ఆరాధించుట కష్టము. అది దుఃఖకరము. అందుకే "అవ్యక్తాహి గతి దుఃఖం" అని గీత చెప్పినది. కావున "ప్రకృతిం స్వాం అధిష్ఠాయ", "సంభవామి యుగే యుగే", "ఆత్మమాయయా", "మానుషీం తను మాశ్రితమ్" అను గీతల ప్రమాణముగా ఆయన ప్రకృతి స్వరూపమగు ఒక నరరూపమను ఆశ్రయించి అధిష్టించును. ఆయన సత్ అను శబ్దము చేతను, ఈ నర రూపము న్యత్ అను శబ్ధము చేతను శ్రుతిలో "సచ్చత్యత్యాభవతు అసమ్నేవ సభవతి" ఇత్యాది మంత్రములలో చెప్పబడినది. దీనినే అవతార మందురు. తీగెను వ్యాపించిన కరెంటు వలె ఎక్కడ తగిలినా షాక్ కొట్టినట్లు ఈ నర రూపమంతయు సద్రూపమే అయియుండును. రవ్వ లడ్డూలో గోధుమ రవ్వతో కలసిన పంచదార వలె ఎక్కడ ఎంగిలి చేసినను తియ్యగనే ఉండును. ఇట్లు పరమాత్మ జీవులకు నిరంతరమము అనభవమునకు అందుచు ప్రత్యక్షమగు చున్నాడు. "యత్సాక్షాత్ అపరోక్షాత్ బ్రహ్మ" అను శ్రుతి దీనినే చెప్పుచున్నది. కావున ప్రత్యక్ష ప్రమాణమును విశ్వసించు నాస్తికుల సహితము పరమాత్మను ప్రత్యక్షముగానే అంగీకరించవలెను. ఈ విధముగా శ్రుతికి ప్రత్యక్ష ప్రమాణ బలము ఉన్నది. కావున శ్రుతిని కల్పనగా తీసుకొనరాదు.

## కాలము-శక్తి-కర్తవ్యములు

[15. 11. 2002] కర్తవ్యములు: కర్తవ్యముల వరకు సంబంధించిన లౌకిక జ్ఞానము అవసరమే. అదియును సాధనలో ఒక భాగమే. ఏలననగా సాధన చేయుటకు అన్నపాన వస్త్రములు కావలయును. "శరీర యాత్రా

పిచతే” అను గీత ప్రకారముగా ఈ మూడును కలిపి శరీర యాత్రా అనబడును. సంన్యాసికి సైతము ఈ మూడు కావలయును. ఇక గృహస్తునకు వీటితో పాటు గృహము మరియును దారాపుత్రులకు అన్నపాన వస్త్రములు కావలయును. మానవ జీవితము ఒక నిర్ధిష్టమైన ఆయుఃప్రమాణము కాలము కలిగి యుండును. కావున కాలము పరిమితము. ఇక తిను అన్నమును అరిగించి శక్తిని పుట్టించుటకు జీర్ణకోశము రోజుకు రెండు లేక మూడు సార్ల కన్న ఎక్కువ పని చేయదు. ఈ రెండు మూడు సార్లలో ప్రతిసారి పరిమితాహారమును గ్రహించి పరిమితమైన శక్తినే పుట్టించగలవు. ఈ విధముగా కాలశక్తులు పరిమితములై యున్నవి. ధనము వ్యర్ధమైనచో ఎంత ధనమునైనను మరల సంపాదించవచ్చును. కాని కాలశక్తులలో ఒక్కచుక్క వ్యర్ధమైనను మరల సంపాదించలేము. ఈ కాలశక్తుల గురించిన జ్ఞానమే అర్ధనారీశ్వర స్వరూపము. శివుడు కాలము, పార్వతి శక్తి. అదే కాలభైరవ స్వరూపము. అది గురుతత్వమై యున్నది. గురువు అనగా జ్ఞానము. కావున కాలభైరవుడు గురువు. అనగా కాలము యొక్క, శక్తి యొక్క విలువను తెలుసుకొనుటయే. ఇది తెలుసుకొని లాభపడుటయే కాలభైరవుని అనుగ్రహము. ఓ జీవా! కాలమును, శక్తిని వ్యర్ధ పరచకుము. కర్తవ్యములు పోను మిగిలిన కాలశక్తులను భగవదర్పణము చేయుము. కర్తవ్యముల పేరుతో లౌకికమును పొడిగించకుము.

1) సంన్యాసివైనచో అన్నపాన వస్త్రముల వరకే కర్తవ్యము.

2) గృహస్తుడైనచో దారాపుత్రుల అన్నపానముల వరకే పరిమితము కమ్ము.

3) పుత్రికలు అత్తవారింటికి పోగా, పుత్రులు వారి వారి కాళ్ళపై నిలబడగా అప్పుడైనను వెనుకకు తిరుగుము. అంతే కాని తరతరములకుసరిపోవు ధనమును సంపాదించుట వలదు.

4) మనుమలు మనుమరాళ్ళ భాధ్యత నీకనవసరము. అంత్య కాలము కొన్ని ఘడియలలో యుండగా అప్పుడును మనుమలు మనుమరాళ్ళతో తైతక్కలాడి కాలశక్తులను వ్యర్ధము చేయుచున్నావు. ఈ జన్మయను సినిమా షూటింగు మిగియగనే నీవును, నీవారును శతృవులుగా యుద్ధము చేయు పాత్రలో చేరవచ్చును. లేక నీవే మరు జన్మమున కుక్కవైపుట్టి నీవారిని చూచుటకు పోగా నీవు లాలించిన మనుమలు మనుమరాళ్ళు నిన్ను నీ ఇంటిలోనికి రానీయక రాళ్ళతో కొట్టగా ఎంతో దుఃఖముతో నీవు విలపించుచు పోవుచుండగా పరమాత్మ దయతో ఒక సద్భక్తుని ఆవేశించి నిన్ను పిలచి నీకింత అన్నము పెట్టించును. ఇప్పటికి సిగ్గు తెచ్చుకున్నావని తెలిసి మరల నీకు మానవ జన్మ ప్రసాదించగా, మరల “కుక్క తోక వంకర” యను రీతిలో లౌకిక బంధమలలో మునిగి తైతక్కలాడుచున్నావు. ఇట్లు నాలుగు ఐదు సార్లు చూసి వీనికి ఇంక బుద్ధిరాదని శాశ్వతముగా పశుపక్ష్యాది జన్మలే ఇవ్వబడుచున్నవి. కాలశక్తులు ముచ్చట్లతోను, కథల పుస్తకములతోను, టివి సినిమాలతోను వ్యర్ధపరచువాడు శాశ్వతముగా నష్టపోవును. కనీసము కాలశక్తులను ధనార్జనలో వినియోగించువాడు ఒకనాటికైననూ తరించవచ్చును. ఒకనాటికైనను ఆ కాలశక్తులను వ్యయము చేసి సంపాదించిన ధనములో కొంత స్వామి సేవకు వినియోగించినప్పుడు ఆ కొంత ధనమును సంపాదించుటకు ఎంత కాలశక్తులను వినియోగించినాడో అంత కాలశక్తులను భగవత్పరము చేసినవాడగును. కావున తరించగలడు.

5) కావున అతి ముఖ్యమైన కర్తవ్యములు పోను మిగిలిన కాలశక్తులను దత్తసేవలో వినియోగించుము లేదా ఆ

మిగిలిన కాలశక్తులతో ధనమును ఆర్జించుము. ఈ రెండింటికి కాక ముచ్చట్లు మొదలగు వ్యసనములతో కాలశక్తులు దుర్వినియోగ పరచి ఇహపరములకు దూరమగుచున్నావు.

6) ధనమును దత్త సేవలో వినియోగించు విధానము కూడా తెలియవలెను. చాలా మంది గుళ్ళు, ఆశ్రమములు నిర్మించి దైవసేవ చేసినామని తలచుచున్నారు. ఉన్న దేవళములన్నియు పాడు పడుచుండగా కొత్త గుడులు ఏల? పెద్ద దేవాలయములు ఎందుకు నిర్మించబడినవి? గుడి యొక్క ప్రధాన లక్ష్యము సత్సంగము జరుపుటకే గాని, అర్చనలు ప్రసాదముల వరకు కావు. దైవ ప్రతిమ గల గర్భాలయము చాలా చిన్నదిగా యుండును. ఈనాడు గుడిలో సత్సంగము యను మాటయే లేదు. కోరికల జాబితాతో క్యూలో నిలబడి దైవముతో వ్యాపారము చేయు వారితో గుడి కిటకిటలాడు చున్నది. కొత్త గుడులు వ్యాపారాభివృద్ధికై నిర్మించబడిన కొత్త దుకాణాల వలెయున్నవి. మరియు ఆశ్రమములు సామంత రాజుల రాజ్యములవలె యున్నవి. శ్రీ దత్తుడు చేసిన అద్భుతములను తానే చేశానని గర్వముతో మత్తెక్కి భక్తులు పొగుడుచుండగా తానే దత్తుడనని పలుకుచూ ఆశ్రమములను విస్తరించుకొనుచున్నారు. ఇట్టి వారిని గురువులుగా చేసికొని అజ్ఞానులగు జీవులు గుడ్డివానిని పట్టుకున్న గుడ్డివాని వలె భావిలో పడుచున్నారు.

7) కావున సత్సంగములను చేసి వాటిని గ్రంథములుగా ముద్రించి ఆ గ్రంథములు సంచార దేవాలయములుగా మారి జ్ఞానప్రచారము చేయవలెను.

8) అట్లే భజనలు పాడుచు కాసెట్ల రూపములో భక్తి ప్రచారము చేయవలెను. పూర్వకాలమున ముద్రణము లేనందున శంకరులు సత్సంగ చర్చలతో జ్ఞానప్రచారమము చేసెను. అట్లే ఆ కాలములో కాసెట్లు లేనందున మీరాబాయి భక్త బృందములతో పాడుచు భక్తి ప్రచారము చేసెను. శంకరులు గాని, మీర గాని దేవాలయములును గాని, ఆశ్రమములను గాని ఎచ్చటను ఎప్పుడును నిర్మించలేదు. ఇట్లు అంతరార్థము తెలిసి సేవ చేసిననే జ్ఞానరూపుడగు శ్రీ దత్తునికి ప్రీతికలుగును.

## కార్తీక శుద్ధ దశమినాటి దివ్యవాణి

[14.11.2002 గురువారము మధ్యాహ్నము 2.30 చిత్రభాను నామ సంవత్సరము కార్తీక శుద్ధ దశమి] ఎంతో జ్ఞానము కలిగిన పండితులకును భక్తి వచ్చుటలేదు. జ్ఞానము వలన భక్తి వచ్చును అన్నాము కదా! మరి వీరిలో జ్ఞానము భక్తిని ఏల పుట్టించుట లేదు. దీనికి కారణము వీరిలో బ్రహ్మజ్ఞానము వంటపట్టుట లేకపోవుటయే. ఎన్ని శాస్త్రములు చదివినను, ఎన్ని సత్సంగములు చేసినను బ్రహ్మజ్ఞానము వీరిలోనికి ఎక్కలేదు. తడుసిన కట్టెకు ఎన్నిసార్లు అగ్గిపుల్ల గీసి అంటించిననూ దానిలోనికి అగ్ని ప్రవేశించదు. కావుననే జ్ఞానయోగమునకు చిత్తశుద్ధి అవసరమని శంకరులు అన్నారు. చిత్తశుద్ధి అనగా ఎండిన కట్టె. కట్టె అనగా మనస్సు. ఈ లౌకిక జ్ఞానమే నీరు. మానవుని మనస్సు అను కట్టె లౌకిక జ్ఞానము అను నీరుతో చేరనపుడు ఎన్ని గ్రంథములు చదివినను, ఎన్ని

సత్సంగములు చేసినను వ్యర్థమే. లౌకిక జ్ఞానమును ఈ నీరు ఎన్నో విధములుగా మనస్సు అను కట్టెలోనికి ప్రవేశించుచున్నది. ఆ విధములను విచారించి వాటిని నిరోధించిన గాని ఈ కట్టె ఎండు కట్టె కాదు. ఈ విధములు ఏవి?

అనగా లౌకికులగు మానవులతో సంగము పెట్టుకొనుటయే. భార్య, భర్త, సంతానము, బంధువులు, మిత్రులు వీరందరును లౌకికులే. వీరితో కల బంధములన్నియు లౌకక బంధములే. అనగా సినిమా షూటింగులోని పాత్రల మధ్య బంధములే. ఈ బంధములు అసత్యములు కావున అశాశ్వతములు. చివరకు నటుడు వేసుకన్న వేషముతోటి బంధము కూడా అసత్యము అశాశ్వతము. నాటకము తర్వాత ఆ వేషమును తీసి విడిగా పెట్టినప్పుడు ఆ వేషము మరియొక నటుడు ధరించుచున్నాడు. ఈ శరీరమే ఆ వేషము. మరణానంతరము ఈ శరీరము పంచభూతములలో కలసి ఆ పంచభూతములు మరియొక జీవునకు శరీరముగా ఏర్పడుచున్నవి. కావున ఈ శరీరము మరియు సర్వ లౌకిక బంధములను అసత్యములై అశాశ్వతములై మరణానంతరము జీవునకు ఎట్టి శ్రేయస్సునూ కలుగ చేయజాలవు. ఈ లౌకిక బంధములు గల వ్యక్తులు ఎల్లప్పుడును బ్రహ్మజ్ఞానమునకు సంబంధించని లౌకిక విషయములనే మాటలాడుచు ఇంజక్షనుల ద్వారా లౌకిక జ్ఞానమను విషమును ఎక్కించుచున్నారు. ఈ విషములు చాలక పెండిళ్లు, పేరంటములు, మీటింగిలకు పోయి ఇంకను విషము నెక్కించుకొనుచున్నారు. అంతటితో ఆగక, ఇదియును చాలక టి. వి లు, సినిమాలు, నవలలు చదువుట, వార్తాపత్రికలు వీక్లీలు చదువుట, పని కల్పించుకుని ఇతరుల గృహములకు వెళ్ళి ముచ్చట్లు చెప్పుకొనుచూ పూర్తిగా తడిసిన కట్టెలగుచున్నారు. వీరు సత్సంగమునకు వచ్చికూడా లౌకిక విషయములనే మాట్లాడు కొనుచున్నారు. చివరకు సత్సంగ ఫలము కూడ లౌకిక లాభములకే భావించుచున్నారు. ఇట్లు ఈ సంసార సాగరమున నిత్యము మునిగియుండు ఈ కట్టెలకు ఎన్ని బోధలను అగ్గిపుల్లలను గీచినను ప్రయోజనము లేదు. కాలభైరవుని శాసనము ననుసరించి వీరికి వచ్చు అనగా రాబోవు జన్మలన్నియు పశు, పక్షి, మృగ, కీటకాది జన్మలే అయియున్నవి. ఇది శ్రీ దత్తుని హృదయమునకు ఎంతో విచారము కల్గించుచున్నది. కావున లౌకికుల మాటలను వినుటయను శ్రవణమును వెంటనే ఆపివేయవలెను. శ్రవణము ద్వారా లౌకిక జ్ఞానము మనస్సునకు ఎక్కుచూ మననములు అను చింతలకు దారితీయుచున్నది. మననము పెరిగిన వాడు భాషణము చేయును. ఆ భాషణము వలన మరియొకని మనస్సునకు లౌకిక విషము ఎక్కుచున్నది. కావున దీని అంతటికిని మందు ఒక్కటే. లౌకికుల సంగమును పరిహరించుము. తప్పనిసరి అయినచో కుశల ప్రశ్నలు అడిగి తప్పుకొనుము. లౌకిక సంగమును పరిహరించినచో లౌకిక వాక్య శ్రవణము తప్పును. శ్రవణము తప్పినచో మనస్సునకు లౌకిక జ్ఞానము తగ్గును. అనగా కట్టెలోని తడి తగ్గును. క్రమముగా తడి తగ్గి ఎండిన కట్టె అగును. అట్లే క్రమముగా లౌకిక జ్ఞానము పూర్తిగా నశించగనే చిత్తము శుద్ధమై పరపూర్ణ చిత్తశుద్ధి ఏర్పడును. ఇప్పుడు ఎండు కట్టెకు అగ్గి పుల్లగీచి ముట్టించినచో అగ్ని స్వరూపమై ఆ ఎండు కట్టె మండును. అట్టి చిత్తశుద్ధి ఏర్పడిన తర్వాత జ్ఞానుల సత్సంగమున పాల్గొన్నచో జ్ఞానము వంటపట్టును. అప్పుడు ఆ జ్ఞానము భక్తికి దారి తీసి భగవత్ప్రాప్తిని కలిగించును. ఈ చిత్తశుద్ధి కొరకు చేయు ప్రయత్నములే యమము,

నియమము. లౌకిక సంగమును పరిహరించుటయే యమ, నియమముల సారాంశము. భార్యా, పతి, పుత్రాదులును లౌకిక బంధములే కావున వారితోను అతిముఖ్య కర్తవ్య విషయములతోనే మాట్లాడి లౌకిక విషయ చర్చలను తగ్గించుము. మీ ఇంటిలోని వారు మీ సొంతవారనియు, ఎదురింటివారు పరాయివారనియు భ్రమపడుచున్నావు. నాటకములో సుబ్బయ్యయనువాడు నీ పుత్రునిగా నటించినాడు. ఎల్లయ్యయనువాడు ఎదుటివాని పుత్రునిగా నటించినాడు. నాటకము ముగియగనే సుబ్బయ్య, ఎల్లయ్య ఇద్దరు సమమే కదా. సుబ్బయ్య నిజముగా నీ కొడుకు కాదు, ఎల్లయ్య నిజముగా ఎదురింటి వాని కొడుకు కాదు. నీ నిజ జీవితములో కష్టము వచ్చినప్పుడు సుబ్బయ్య ఆదుకొనక, ఎల్లయ్య ఆదుకున్నాడనుకొనుము, ఇప్పుడు చెప్పుము. ఈ రాత్రి నాటకములో నీకొడుకుగా నటించిన సుబ్బయ్య నీ ఆత్మీయుడా, లేక నీ నిజ జీవితంలో సాయపడిన ఎల్లయ్య ఆత్మీయుడా? అట్లే నీకు నిజముగా శ్రేయస్సును కలుగచేయు, సత్సంగమును కలిగించు జ్ఞానులు భక్తులే నీ ఆత్మీయులని తెలియుము. అట్టి వారిపై మమకారమును పెంచుకొనుము. వారే నిజముగా నీబంధువులు. వారిని సేవించుము. వారికి సాయపడుము. నీవు ధన్యుడ వగుదువు. తల్లిదండ్రుల బంధములు కూడా నాటక బంధములే. స్వర్గములో యున్న అభిమన్యుడు అర్జునుని చూచి "నీవే జన్మలో తండ్రివి" అని అడిగినాడు. కావుననే త్యాగరాజు తల్లిదండ్రుల, బంధువుల పేర్లు చెప్పక "సీతమ్మ మాయమ్మ శ్రీరాముడు మా తండ్రి లక్ష్మణాదులు సోదరులు హనుమదాదులు బంధువులు" అని చెప్పినాడు. ఇట్టి స్థాయికి మానవుడు వచ్చినపుడే తప్ప, మానవుడు జ్ఞానయోగమును మొదటి మెట్టు ఎక్కలేడు.

## పరబ్రహ్మ స్వరూప నిర్ణయము

పరబ్రహ్మము సాకారుడే. ఈ పరబ్రహ్మము "సః పురుషః" ఇత్యాది శబ్దములచే శ్రుతులలోను పురుషోత్తముడని గీతలోను ప్రస్తావించబడియున్నది. కావున ఈ పరబ్రహ్మము సాకారమే కాక శ్రేష్ఠమైన పురుషాకారమైయున్నది. ఇంత మాత్రమున జీవులలో స్త్రీల కన్న పురుషులులెక్కువ అని భావించరాదు. జీవులందరు ప్రకృతి రూపులైన స్త్రీలే. జీవులలోనున్న పురుషులు, పురుష వేషమున ఉన్న స్త్రీలే యని భావించవలెను. పరబ్రహ్మమొక్కడే పురుషుడు. "పురుష ఏ వేదగం సర్వం", "అథ పురుషోహవై నారాయణ" అను శ్రుతులు దీనినే చెప్పుచున్నవి. ఈ నిర్గుణ, యోగీశ్వరస్వరూపము కోటాను కోట్ల సూర్యుల తేజస్సుతో విరాజిల్లుతూ చర్మచక్షువులకు అగ్రాహ్యమైయున్నది. ఈ మూలరూపము కేవలము ఆ పరమాత్మ అనుగ్రహముచే దత్తమైన దివ్యనేత్రమునకే చూచుటకు సాధ్యము కావున కనపడడు అను శ్రుతులన్నియు చర్మ చక్షువులకు చూచుటకు వీలుగాని మూలరూపమును గురించి చెప్పుచున్నవి. కనపడును అన్న శ్రుతులన్నియు చర్మచక్షువులచే చూడబడు అవతార బాహ్యమనుష్య రూపమును గురించియు, లేక దివ్య ఋవులచే చూడబడు మూలరూపమును గురించి చెప్పుచున్నవి. ఇక బుద్ధికి కూడా అర్థము కాని పరబ్రహ్మతత్త్వమును గురించి చెప్పిన శ్రుతులు మూలస్వరూపమునకును, అవతార స్వరూపమునకును వర్తించును. అనాద్యనంతమైన విశ్వమును సృష్టించిన

మూలస్వరూపమును గురించిన తత్త్వము బుద్ధికి ఎటూ చిక్కదు. ఇక అవతార స్వరూపము కంటికి కనపడుచున్నను, దీని తత్త్వము కూడా బుద్ధికి చిక్కుటలేదు. ఉదాహరణకు శ్రీకృష్ణుడు కంటికి కనపడుచున్నను గోవర్ధన పర్వతమును చిటికిన వేలుపై నిలిపినపుడు ఆ కృష్ణతత్త్వము బుద్ధికి అగ్రాహ్యమై యున్నది కదా! ఇక మూలస్వరూపము సాకారము కాక నిరాకారము అని చెప్పినచో బాగుండునని కొందరు తలచుచున్నారు. వీరి మతము ప్రకారముగా ఆది అంతములు లేని ఈ విశ్వమును భరించు వస్తువు కూడా ఆది అంతములు లేనిదై యుండవలెను. ఇట్లు చెప్పినచో ఇది తర్క సమ్మతముగా యుండును. కాని పరబ్రహ్మతత్త్వము తర్కాతీతము కదా! కావున ఆది అంతములు కలిగి పరమితమైన ఒక రూపము ఆది అంతములు లేని అపరిమితమైన ఈ జగత్తును ధరించి ఉన్నదని చెప్పినచో ఇది తర్కమునకు అందని విషయమై యుండును. అనగా పరిమితాకారము కలిగిన కృష్ణుడు అపరిమితమైన జగత్తును ధరించియున్నాడు అన్నచో ఈ విషయము బుద్ధికి అందదు. అట్లు కాక అపరిమితమైన నిరాకార పరబ్రహ్మ స్వరూపము అపరమితమైన జగత్తును ధరించి ఉన్నది అన్నచో ఈ విషయము బుద్ధికి తర్కసహితముగా అందు చున్నది. తర్కసహితముగా బుద్ధి పరబ్రహ్మతత్త్వమును అందుకొనలేదని శ్రుతులు చెప్పుచున్నవి కదా! కావున పరిమితాకారము గల సాకారమైన యోగీశ్వర మూలస్వరూపమే అసలు నిర్గుణ పరబ్రహ్మ స్వరూపమనియు నిశ్చయించబడుచున్నది. ఉదాహరణకు పరమితాకారము కలిగిన బాలకృష్ణుడు తన చిన్న నోటిలో అనంత జగత్తును యశోదాదేవికి చూపుట చేత పరిమితాకారుడైన ఆ బాలకృష్ణుడే పరబ్రహ్మమని చెప్పుటలో తర్కమునకు అందని తత్త్వము స్పష్టమగుచున్నది.

## పరబ్రహ్మ స్వరూపము

పరబ్రహ్మము ఇంద్రయములకును, మనస్సుకును, బుద్ధికిని, ఊహలైన తర్కములకును అందదు అని ఆనేక శ్రుతులు బోధించుచున్నవి కదా! ఉదాహరణకు 'న తత్ర వాగ్గచ్ఛతి', 'న మనోగచ్ఛతి', మరియు 'ఎ తోవాచో నివర్తంతే', 'అప్రాప్య మనసాసః', 'యో బుద్ధే పరతస్తు సః', 'న మేధయా', 'నైషాతర్కేణ', 'న చక్షుషా', 'న సందృసే', 'అతర్క్యః కథమే తత్ విజానీయామ్' అను శ్రుతులన్నియును ఈవిషయమునే చెప్పుచున్నవి. ఇట్టి బ్రహ్మము "యత్ సాక్షాత్" మరియు "ప్రత్యగాత్మాన మైక్షత్" ఇత్యాది శ్రుతులు పరబ్రహ్మము కంటికి కనబడుచున్నదని చెప్పుచున్నవి. వీటి సమన్వయము ఎట్లు చేయవలెను? కంటికి కనబడుచున్న బ్రహ్మము అవతారపురుషుడనియు, కంటికి కనబడని బ్రహ్మము అగ్రాహ్యమైన నిర్గుణ బ్రహ్మమనియు చెప్ప వచ్చునా? శ్రీకృష్ణుని అర్జునుడు చర్మ చక్షువులతో చూచుచునే ఉన్నాడు. అయితే శ్రీకృష్ణుని అసలు స్వరూపమైన యోగీశ్వర స్వరూపమును చూపమని అర్జునుడు అడిగినపుడు శ్రీకృష్ణుడు తన నిజ స్వరూపమును చర్మ చక్షువులతో చూచుటకు వీలు కాదనియు, దానిని దివ్యనేత్రములతో చూడమనియు చెప్పి సమస్త విశ్వమునకు కారణ, ధారణ, మారణ తత్త్వమైన తన పరబ్రహ్మ స్వరూపమును చూపినాడు. అనేక దేవతాముఖములతో జగత్తునంతయు పుట్టించి, భరించి, ఉపసంహరించి తన నిజస్వరూపమే సృష్టి, స్థితి, లయ కారణమైన

పరబ్రహ్మ స్వరూపమని చూపించినాడు. ఆ స్వరూపమునకు కాళ్ళు, చేతులు, ఉదరము, ముఖము మొదలగు అవయవములున్నవి. మరి ఆ నిర్గుణ పరబ్రహ్మము నిరాకారము ఎట్లగును? ఈ జగత్తుకు సృష్టి, స్థితి, లయ కారణమైన పరబ్రహ్మము నిరాకారమని బ్రహ్మ సూత్రములు చెప్పుచున్నవి. "అరూప వ దేవ తత్ప్రధానత్వాత్" శ్రుతియు "న రూపమస్త్యేహ" అనియు "అరూపమవ్యయం" అనియూ నిరాకార తత్త్వమును కూడా ప్రస్తావించుచున్నది. కావున ఈ శ్రుతులను, గీతలను, బ్రహ్మ సూత్రములను సమన్వయించి పరబ్రహ్మ స్వరూపమనను నిర్ణయించవలెను. ఈ నిర్ణయము ఈ విధముగా ఉన్నది.

## శుద్ధావతారము - ఆవేశావతారము

రామకృష్ణాది అవతారములు శుద్ధావతారములు లేక నిత్యావతారములు అనబడును. ఇందులో స్వామి శుద్ధ చైతన్యముతో కూడిన తన సంకల్పముచే సృష్టించబడిన శరీరమును ఆశ్రయించి అవతార జననము మెదలు మరణము వరకు అందులో నిత్యముగా యుండును. ఆవేశావతారములో పరమాత్మ ఒక సామాన్య మానవుని ఆవేశించును. ఇట్టి ఆవేశములో సామాన్య మానవుని శరీరముతో పాటు జీవుని కూడా వ్యాపించి యుండును. ఇట్లు వ్యాపించిన సమయమున శుద్ధావతారమునకు, ఆవేశావతారమునకు ఎట్టి భేదము లేదు. ఒక లోహపు తీగెను కరెంటు వ్యాపించి యున్నను, రెండు లోహముల మిశ్రమమైన తీగెను కరెంటు వ్యాపించియున్నను, కరెంటు ప్రవహించుచున్నంత వరకు ఆ రెండునూ కరెంటు తీగెలె. కావున ఆవేశావతారమైన పరశురాముడు దశావతారములలో చేర్చబడినాడు. పరశురాముడు ఒక ముని కుమారుడు. అతని శరీరములో సంస్కారమయుడైన జీవుడున్నాడు. ఆ శరీరము అతనికి కర్మఫల లబ్ధమే. ఆ శరీరము ఒక వృక్షము వంటిది. ఆ శరీరములో ఉన్న ఆ జీవుడు ఒక పక్షి వంటివాడు. ఆ జీవుడు అనేక జన్మలు పరమాత్మకై తపించినవాడు. ఆట్టి ఆ జీవుని శరీరమును పరమాత్మ ఆవేశించుట పరమాత్మ అను మరొక పక్షి ఆ శరీరమున వాలి ఆ జీవునితో కలసి గూఢముగా కూర్చున్నది. ఈ శరీరములో ఉన్న పరమాత్మ దుష్ట సంహారమను అద్భుతమహిమను చేసి, ఆ కీర్తిని పరశురామునికి ఇచ్చినది. ఈ ఆవేశావతార విషయమునే "ద్వా సుపర్ణా సయుజా" అను శ్రుతి చక్కగా వివరించుచున్నది. గీతలో కూడా "ప్రహ్లాదశ్చాస్మి" అను గీతలు ప్రహ్లాదుడను జీవపక్షితో పరమాత్మపక్షి చేరి హిరణ్యకశిపుడు సంహరించుటకు ఎంత ప్రయత్నించిననూ, ఆ ప్రయత్నములన్నియు విఫలములగునట్లు చేసి ప్రహ్లాదునకు కీర్తి నిచ్చినది. ఈ శ్రుతిలో "సఖాయ" అను శబ్ధము తపస్సు ద్వారా జీవపక్షి, పరమాత్మపక్షికి ఇష్టుడగుట సూచించుచున్నది. "సయుజ" అను శబ్ధము దానికి సంతోషించిన పరమాత్మపక్షి, జీవపక్షిలో చేరుటను సూచించుచున్నది.

"స్వాదు అత్తి" అను శబ్ధములు జీవపక్షి కీర్తి ఫలమును భోగించుటను సూచించుచున్నది. "అనశ్నన్" అను శబ్ధము ఆ కీర్తి పరమాత్మ గ్రహించక జీవపక్షికి ఇచ్చుటను సూచించుచున్నది. ఐతే ఈ మహిమను పరమాత్మ చేసినాడని గ్రహించక, పరశురామ జీవపక్షి తానే చేసితినని అహంకరించెను. ఇట్టి ఈ అహంకారమును

నిత్యావతారమైన రామ పరమాత్మపక్షి పోగొట్టినది. ఇట్టి అవేశావతారమే హనుమంతుడు కూడా. అయితే సముద్రలంఘనమను మహిమను చేసిన తర్వాత హనుమంతుడు అహంకరించక ఇది రామ శక్తియేనని ప్రకటించినాడు. అట్టి భక్తునికు ఆ కీర్తిని శాశ్వతముగా అంటగట్ట తలచి రామాంజనేయ యుద్ధమున రాముడు ఓడిపోయి ఆంజనేయుని గెలిపించి తన కన్న ఆంజనేయుడే గొప్పవాడానియు, తన కన్న హనుమంతుడే మహామహిమాన్వితుడనియు ప్రకటించుటకై రాముడు ఎట్టి మహిమలను చేయక, తాను సామాన్యునివలె నటించెను. రాముడే మహిమలను చేసియున్నచో హనమమంతుని సముద్ర లంఘనము రాముడే చేయించినాడని లోకము భావించి యుండెడిది. ఈ నిత్యావతారము చేయవలసిన కార్యము యొక్క స్థాయిని బట్టి కళావతారముగను, అంశావతారముగను ఉండుచుండును.

## ప్రకృతిం స్వాం అధిష్టాయ

బృహదారన్య ఉపనిషత్తు మరణం గురించి చెప్పుచున్నది. పరమాత్మ అవతరించినపుడు తనకు అతి సన్నిహితమైన ఆత్మీయమైన ప్రకృతిని ఆశ్రయించును. "ప్రకృతిం స్వాం అధిష్టాయ" అన్న గీతార్ధమిదే. ఆత్మీయమైన ప్రకృతి సత్వగుణ స్వరూపము. అనగా ఈ ప్రకృతి పంచభూతమయమైన శరీరముతో పాటు శుద్ధ చైతన్యమును (చేతన) కూడా కలిగి యుండును. ఈ శుద్ధ చైతన్యము తాను జీవించుచు శరీరమును జీవింప చేయునది కావున జీవుడు అని పిలవబడుచున్నను ఇతర మానవులయందున్న జీవ స్వరూపములకు భిన్నముగా యుండును. "జీవతి, జీవయతి ఇతి జీవః" అని జీవ శబ్దమునకు అర్ధము. అనగా శుద్ధ చైతన్యము. ఇతర మానవులలో ఈ శుద్ధ చైతన్యము పుణ్యపాప కర్మల సంస్కారములతో కలుషితమై పంచదార మరియు మురికి కరిగిన శుద్ధ జలము వలెయుండును. అవతార పురుషుని శరీరములో ఉన్న శుద్ధ చైతన్యము ఎట్టి కర్మల సంస్కారము లేక శుద్ధ జలము వలెయుండును. ఇట్టి శుద్ధ చైతన్యము ఎట్టి ప్రత్యేకతయు లేక శరీరములో ఒక భాగముగానే యున్నది. కావున ఇచ్చట ఈ శుద్ధ చైతన్యము శరీరము కన్న భిన్నమైన జీవునిగా వ్యవహరింపబడుటలేదు. ఇతర ప్రాణులలో ఈ శుద్ధ చైతన్యము సంస్కారములతో కలుషితమై శరీరము కన్న భిన్నముగా ఒక ప్రత్యేకత కలిగి జీవుడుని పిలువబడుచున్నది.

అవతార పురుషుని శరీరము కార్యము ముగిసిన తర్వాత ఇచ్చట త్యజింపబడినపుడు పరమాత్మను వదలి పంచభూతములలో కలియుచున్నది. ఈ శుద్ధ చైతన్యము మనోమయమై తేజస్సు యొక్క రూపము కావున అగ్ని అను భూతమునందు ఇచ్చటనే కలియుచున్నది. "మనోమయ", మరియు "తేజఃసతి" అను శ్రుతులు దీనికి ప్రమాణములు. ఇతర ప్రాణులు మరణము నందు ఈ శుద్ధ చైతన్యము సంస్కారములచే కలుషితమై నందున జీవుడు అనబడుచు "జాయస్వ", "మ్రియస్వ"అను శ్రుతి ప్రకారముగా ఆయా కర్మ ఫలములను పొందుచు పుట్టుచు, గిట్టుచు ఉన్నాడు. ఇక పరమాత్మ అవతరించినప్పుడు ఆయన వెంట వచ్చిన భక్తులగు సేవకుల గతి ఏమి? వీరు మరణానంతరము పరమాత్మను పొంది "పురుషాయణాః పురుషం ప్రాప్యా" అను

శ్రుతి ప్రకారముగా పరమాత్మలో అవ్యక్తస్థితిలో ఉండి “న విదుః సతి” అను శ్రుతి ప్రకారముగా నిద్ర, విశ్రాంతినికొని మరల పరమాత్మతో పాటు అవతరించుచున్నారు. ఇట్టి వీరి యొక్క జీవశరీరము ఎట్లుండుననగా జ్ఞానము, విశ్వాసము, భక్తి మెదలగు పుణ్య సంస్కారములతో కూడిన శుద్ధ చైతన్యముగా కేవలం పంచదార కలసిన శుద్ధ జలము వలెయుండును. వీరికి పరమాత్మకు వలె జన్మించునపుడు బద్ధ నరక దుఃఖము కాని, మరణించునపుడు మరణ వేదన కాని యుండదు. ఇట్టి జనన మరణ దుఃఖము నుండియే మోక్షము. అంతే తప్ప జనన మరణములు లేవని కాదు. పరమాత్మయే అవతారముల ద్వారా జనన మరణములను గ్రహించుచున్నాడు. ఇట్టి జనన మరణములు పరమాత్మకు కాని, ఆయన సేవకులకు గాని కేవలము కట్టిన వస్త్రమును వదలి శుద్ధ వస్త్రమును గ్రహించిన రీతిగా ఉండును. “వాసాంసి జీర్ణాని” అను గీతార్ధముఇదే. “నివసిష్యసి మయ్యేవ" మరియు "ప్రవేష్టుంచ పరంతప” అను గీతలు స్వామి ఆత్మీయులైన భక్తులు మరణానంతరము స్వామిలోనికి ప్రవేసించి అణు ప్రమాణ జీవరూపులుగా నివసించెదరని చెప్పుచున్నది.

## బ్రహ్మజ్ఞాన సారము

[వృషనామ సంవత్సరము మార్గశిర బహుళ దశమి మంగళవారము ఉదయం 6 గంటలకు శ్రీ దత్త దివ్యవాణి.] పంచ భూతమయమైన మనుష్య శరీరమును ధరించిన బ్రహ్మర్షులు సైతము యుగ యుగముల తపించి, పంచభూతమయ సృష్టికి అతీతమైన పరబ్రహ్మ స్వరూపమును గ్రహించుట అసాధ్యమని తెలిసి, వారి కొరకు పంచభూతమయమైన మనుష్య శరీరమును ఆశ్రయించిన పరబ్రహ్మమైన కృష్ణావతారములో గోపికలుగా పుట్టి సేవించి తరించిరి. “మానుషీం తనుమాశ్రితమ్” అన్న గీతార్ధమిదే. మరియు శ్రుతి “యత్ సాక్షాత్ అపరోక్షాత్ బ్రహ్మ” అని చెప్పుటలో అర్ధమేమి? పరబ్రహ్మము పరోక్షముగా ఉన్నపుడు అగ్రాహ్యము కావున మనకు అది అందదు. కావున లేని దానిగా పరిగణించవచ్చును. మనకు ఉన్న పరబ్రహ్మము, మనకు అందిన శిలావిగ్రహ రూపమున దర్శన, స్పర్శనలిచ్చి అందుచున్నది. కావున ఉపాసనకు యోగ్యములే కాని అవి సహవాస సంభాషణాదులను అనుగ్రహించ లేనందున పరిపూర్ణ పరబ్రహ్మ స్వరూపము కాజాలవు.

“ఆదిత్యం బ్రహ్మేతి ఉపాసీత” అనగా సూర్యుని పరబ్రహ్మముగా ఉపాసించుము. సూర్యుడు దర్శన, స్పర్శన యోగ్యుడే కాని సహవాస, సంభాషణా యోగ్యుడు కాడు. కావున కేవలం ఉపాసన మాత్రుడేనని ఈ శ్రుతికి అర్థం. ఇక మహావాక్యములలో “అయమాత్మా బ్రహ్మ” అని అనగా మనుష్య శరీరమును ఆశ్రయించిన ఒకానొక విశిష్ట జీవస్వరూడైన రామకృష్ణాది అవతారపురుషుడే పరబ్రహ్మము అని ఈ శ్రుతికి అర్థము. “ప్రజ్ఞానం బ్రహ్మ” అనగా విశిష్టమైన జ్ఞానసంపన్నుడైన గురుస్వరూపుడైన అట్టి విశిష్ట మానవుడే పరబ్రహ్మమని గుర్తించవలయును. “సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ”, “రసోవైసః” ఇత్యాది శ్రుతులు అట్టి అవతారపురుషుడు జ్ఞానానందాది కళ్యాణ గుణతత్త్వసంపన్నుడై ఉండుననియు, అట్టి దానిని అవతార పురుషుని గుర్తించు లక్షణమనియు శ్రుతి బోధించుచున్నది. శ్రీకృష్ణుని భగవద్గీత ద్వారా పరబ్రహ్మముగా ఋషులు గుర్తించినారు.

కాని ఆయన చూపిన సిద్ధుల వల్ల కాదు. అట్టి సిద్ధులు ఆయన సంకల్ప మాత్రములే. ఏలననగా సిద్ధులు సృష్టిలోని భాగములు. సృష్టియును ఆయన సంకల్ప స్వరూపమే. అట్టి సిద్ధులను కంసాది రాక్షసులు కలిగి యుండెను. అట్టి అవతార పురుషుని "తత్త్వమసి"అను మహావాక్యముతో గుర్తించవలెను. "తత్త్వమసి "అనగా 'తత్'=ఆ అందని పరబ్రహ్మము, 'త్వం'= అందిన మానవాకారమైన నీవు, 'అసి'= అయి ఉన్నావు. ఇట్టి ఉపాసనకు అద్వైతము ఆధారమైయున్నది. ఒక తీగెను విద్యుత్ అంతయు ఆక్రమించినప్పుడు ఆ కరెంటు తీగెను కరెంటు అందురు. అట్లే ఆపాదమస్తకము ఆ కృష్ణ స్వరూపము పరబ్రహ్మముచే వ్యాపించబడియున్నది. కరెంటు తీగెను ఎచ్చట ముట్టుకొన్ననూ కరెంటు షాకు తగులుచున్నది. ఈ అద్వైతమును అవతార పురుషుడు కూడా "అహం బ్రహ్మాస్మి" అను వాక్యముతో బోధించును. కృష్ణ భగవానుడు అట్లే "అహం సర్వస్య జగతః ప్రభవః ప్రళయః తథా మత్తః పరతరం కించిత్ నాన్యదస్తి ధనంజయా" అని చెప్పినాడు కదా. కావున మహా వాక్యములన్నియు అవతారపురుషుడే పరబ్రహ్మమనియు అతనిని ఇచ్చట సేవించి ఆనందించి తరించు స్థితియే జీవన్ముక్తి అనియు, పరోక్షముగా ఏమియు లేదనియు, అంతయు ఇచ్చటనే కలదనియు, అంది వచ్చిన దానిని కాదన్న వాడు మహా వినాశము పొందుననియు "మహతి వినష్టిః" అని శ్రుతి చెప్పుచున్నది. "న విదుః సతి" అను శ్రుతి మరణము కేవలము ఏమి తెలియని గాఢనిద్ర వంటి విశ్రాంతి, విరామమైన అజ్ఞానావస్థ అనియు చెప్పుచున్నది. ఈ శ్రుతి కూడా పై శ్రుతినే బలపరచుచున్నది.

**శ్రీ దత్త జయంతి సందేశము**

అత్రి అనసూయలకు మానవ స్వరూపంలో అందరాని పరబ్రహ్మము అందినరోజే దత్త జయంతి. జయంతి అనగా ఆ మానవాకారము సంభవించిన రోజు. అనగా సాక్షాత్కరించిన దినము. అనగా అట్టి మానవాకారములో ఉన్న సద్గురువు నీకు లభించిన రోజు. అట్టి సద్గురువును దర్శించు ప్రతిదినము దత్త జయంతే. అట్టి సద్గురువు సాన్నిధ్యములో ఉండి ఆయనను నిత్యము సేవించు ప్రతిరోజు దత్త జయంతియే. దత్తుడనగా లభించిన వాడు అని అర్ధము. జయంతి అన్ననూ అదే అర్ధము. మార్గశీర్షము అనగా మార్గము నందు శీర్షమును ఉంచుట. అనగా భగవంతుని చేరు సత్యమైన మార్గము నందు బుద్ధిని ప్రసరింప చేయుట అని అర్ధము. నేడు మృగశిరా నక్షత్రము పూర్ణిమతో చేరినందున మార్గశీర్షమైనది. మృగశిర అనగా మృగము యొక్క శిరస్సు. అనగా పశుబుద్ధి అని అర్ధము. నక్షత్రములు అనగా అల్పజ్ఞానము గల అల్పజీవులు అని అర్ధము. పూర్ణచంద్రుడు అనగా వారి మధ్య పూర్ణజ్ఞానము గల సర్వజ్ఞుడగు పూర్ణచంద్రుడే అవతార పురుషుడని అర్ధము. అట్టి అవతార పురుషుని లోకమునకు అందించబడిన పరమాత్మయే కావున దత్తుడనబడుచున్నాడు. అయితే అట్టి అవతార పురుషుని లోకమునకు అందించిన వాడు ఎవరు? అందించబడిన వాడే అందించినవాడు. అనగా స్వయముగా తనను తాను దత్తము చేసుకొనిన వాడు అని అర్ధము. ఇట్లు పరమాత్మ తనను తాను అందించుకున్న స్వరూపమును అసూయ అహంకారములతో విడిచి పెట్టి ఒక మానవుడు ఊహించి చెక్కిన శిల్పములను, గీచిన చిత్రములను

సేవించుట ఎంతటి వెర్రితనము. ఇవి అన్నియు ఊహా చిత్రములే కాని కనీసము తీసిన ఫోటోలు కూడా కావు. కావున మానవుడు అందించిన ఊహరూపములగు జడములను సేవించుట పామర లక్షణము. భగవంతుడు నిర్మించిన రూపములగు ప్రాణులలో సాత్వికులగు సాటి మానవులకును, పశుపక్ష్యాదులకును సేవ చేయుట ఉత్తమ ధర్మమగు ప్రవృత్తి మార్గము.

ఇక నివృత్తి మార్గములో ఇట్టి చైతన్య సహితములగు విగ్రహములలో ఒకానొక స్వరూపముతో పరమాత్మయే అవతరించియున్నాడు. అట్టి అవతార పురుషుని గుర్తించి, సేవించు మోక్షమార్గమే నివృత్తి అనబడుచున్నది. ప్రవృత్తి అనగా సర్వసాధు ప్రాణి వర్గమును సేవించి లోకమునకు శాంతిని అందించుట. నివృత్తి అనగా ప్రాణులలో ఒకానొక ప్రాణి రూపమున ఉన్న పరమాత్మను సేవించి తరించుట. మానవుడు సాటి మానవుని ద్వేషించుచున్నప్పుడు, ఇక మానవరూపములో యున్న పరమాత్మను ఎట్లు గుర్తించి సేవించగలడు? కావున ప్రవృత్తియే తెలియని వానికి నివృత్తి ఎట్లు లభించును? ఉట్టికి ఎక్కలేని అమ్మ స్వర్గమునకు ఎక్కునా? దీనికి గీతలో "ప్రవృత్తించ నివృత్తించ"అని చెప్పుచున్నది. ఈ ప్రవృత్తికి నివృత్తికి మధ్య అడ్డుగోడలే అసూయ అహంకారములు. అసూయ లేని జీవుడే అనసూయ. మూడు గుణముల అహంకారము లేని వాడే అత్రి. చైతన్య స్వరూపమైన జ్ఞానగర్వమే సాత్వికాహంకారము. శక్తి స్వరూపమైన బలము యొక్క మదమే రాజస అహంకారము. జడమైన శరీర దర్పమే తామస అహంకారము. అట్లు అసూయ అహంకారములు లేని సాధకుడే అనసూయ, అత్రి స్వరూపుడు. అట్టి సాధకుడే సాటి మానవ రూపములో యున్న సద్గురువును పొందగలడు. అట్టి వానికే సద్గురువు దత్తమైనాడు లేక లభించినాడు. ఇట్టి అంతరార్ధమును తెలుసుకొనక ఆచరించక అత్రి, అనసూయ అను దంపతులకు ఒక శిశువు జన్మించు ఉత్సవమును పిండి వంటలతో చేసుకొనుట పసిబాలుర వినోదము కొరకు చెప్పబడిన ఒక అవిచారిత రమణీయమైన కల్పన. ఇట్టి కల్పనల స్థాయికి ఉత్తమ సాధకులు కూడా దిగజారుట వారికే ఎంత అవమానమో వారకే తెలియకున్నది. ఉద్యోగములో పై పదవి నుండి క్రింద పదవికి లేక ఒక విద్యార్థి పైతరగతి నుండి క్రింది తరగతికి దిగజారుట అను డిమోషన్ ఎంత అవమానమో ఇదియు అంతే.

కావున ఇట్టి మానవాకారమున అంది వచ్చిన దైవ స్వరూపములను సేవించుట తప్ప మరియొక మార్గము లేదు అను శ్రుతి "నాన్యః పంథా" అని చెప్పుచున్నది. అజ్ఞానాంధకారమును పోగొట్టు జ్ఞాన సూర్యుడుగా సద్గురువును వేదప్రమాణముల ద్వారా తెలుసుకొనవలెనని వేదము "వేదాహ మేతం పురుషం" అని చెప్పుచున్నది. అట్టి సద్గురువును గుర్తించుటకు వేదము, గీత, భాష్యములను ఆధారముగా తీసుకొనవలయును. ఇందులో మొదటి మూడు మహావాక్యములు ఆయన బాహ్యాకారము ఇతర మానవులవలె మానవస్వరూపము అని చెప్పుచున్నవి. "అహం బ్రహ్మాస్మి", "తత్వమసి", "అయమాత్మ బ్రహ్మ". నాలుగవ మహావాక్యము"ప్రజ్ఞానం బ్రహ్మ". ఆయన ఇతర జీవులకు సాధ్యం కాని అతివిశిష్ట బ్రహ్మజ్ఞాన సంపన్నుడు అని చెప్పుచున్నది. "సత్యం జ్ఞానం, ఆనందో బ్రహ్మ" అను శృతులు ఆయన బోధించు బ్రహ్మజ్ఞానము ఇతర పండితులవలె చెప్పు

శిరోవేదనాకరమగు జ్ఞానము కాదని అర్థము. గీత కూడా "మానుషీం తనుమాశ్రితమ్" అని మానవుల కొరకు పరమాత్మ మనుష్య శరీరమును ఆశ్రయించి వచ్చునని చెప్పుచున్నది. మరియును గీత "భూతే జ్యాయంతి భూతాని" అను శ్లోకములో జడములగు పంచభూతముల స్వరూపములగు విగ్రహాదులను సేవించువారు జడములగుదురు. అనగా జడములగు పాషాణాది జన్మములలో జన్మింతురనియు, నరాకారమును గుర్తించి సేవించిన నరజన్మమును పొందుదురనియు చెప్పుచున్నది. విగ్రహములు, పటములు కేవలము దర్శన యోగ్యములే కాని సేవా యోగ్యములు కావు. దూర దేశమున ఉన్న బంధువుల ఫోటోల వంటివే. అట్టి ఫోటోలను దుమ్ము దులిపి శుభ్రముగా ఉండునట్లు విగ్రహములకు స్నానోపచారములు తప్ప మిగిలిన ఉపచారములు అక్కరలేదు. శివ లింగము అన్ని విగ్రహములకు మూల పదార్థము అగు శిలను సూచించు చున్నది. దానికి అభిషేకము తప్ప ఇంకొకటి అక్కరలేదు. కావున విగ్రహాదులు సాధనలో పరమిత ప్రయోజనము కలిగియున్నవి. వాక్కులకు, మనస్సుకు, బుద్ధికి, ఊహకు కూడా పరమాత్మ అందడని వేదములు ఘోషించు చున్నవి.

"న తత్ర వాగచ్ఛతి", "న మనోగచ్ఛతి", "అప్రాప్య మానసాసః", "నమేధయా", "నైషాతర్కేణ", "నచక్షుషా" అట్టి పరమాత్మ మనుష్య శరీరమును ఆపాదమస్తకము వ్యాపించి భక్తులకు దర్శనము, స్పర్శ, సంభాషణము, సహవాసములను అనుగ్రహించుటకును, బ్రహ్మజ్ఞానము బోధించుటకును, తన భక్తుల పాప కర్మఫలములను తానే అనుభవించి అటు ధర్మదేవతకు న్యాయము చేయుచూ, ఇటు భక్తులను కర్మ విముక్తులను కావించుటకును, మానవ రూపంలో అవతరించి దత్తుడనబడుచున్నాడు. వాతావరణములో కంటికి కనిపించని ఎలక్ట్రానులే అందరాని పరబ్రహ్మ స్వరూపము. ఆ ఎలక్ట్రానులే ఒక తీగెలో వ్యాపించి ప్రవహించునప్పుడు ఆ విద్యుత్ తీగెయే అవతారమైన దత్తుడు. విద్యుత్ తీగెను ఎచ్చట ముట్టుకున్నను షాకు కొట్టుచున్నది. కావున ఆ విద్యుత్ తీగెయే మనకు స్పర్శనందించు అనుభవమును ఇచ్చు విద్యుత్. విద్యుత్తుకు, తీగెకు అద్వైతమే ఉన్నది. కావున విద్యుత్తే తీగ, తీగయే విద్యుత్తు. అట్లే మానవరూపియగు దత్తుడే పరమాత్మ. పరమాత్మయే మానవరూపుడైన దత్తుడు. శ్రీ రాముడు, శ్రీ కృష్ణుడు, ఏసు, మహమ్మద్, బుద్ధుడు, మహావీరుడు, గురునానక్, శ్రీ పాద శ్రీవల్లభుడు, శ్రీ నరసింహ సరస్వతి, మాణిక్య ప్రభువు, స్వామి సమర్థ, సాయిబాబా మొదలగు పురుషులే ఈ లోకమునకు అందించబడిన మానవ రూపులగు దత్త స్వరూపములు. ప్రతి మనుష్య తరమునకు ప్రతి దేశప్రాంతమునకును, అందరికినీ సులభముగా నుండుటకు ఈ దత్త రూపములు గురువులుగా అవతరించుచునే యున్నవి. ఒక మానవ తరమునకే ఒక దేశ ప్రాంతమునకే పరమితమైనచో పరమాత్మకు పక్షపాత దోషము వచ్చును. ఈ అంతరార్థమును తెలుసుకొని ఆచరణలో తెచ్చుకున్న పవిత్ర దినమే నిజమైన దత్త జయంతి.

బ్రహ్మ విష్ణు శివ ముఖములతో యున్న దత్తుని స్వరూపమును చూచుచున్నారే గాని ఆ స్వరూపము యొక్క అంతరార్థమును మీరు గ్రహించుట లేదు. దత్తుడనగా అందరాని పరబ్రహ్మము మనుష్యాకారములో

అందివచ్చిన అవతారపురుషుడే భక్తులకు దత్తమైనాడని అర్థము. ఆయన మూడు ముఖములు త్రిగుణములను సూచించుచున్నవి. సత్వగుణము మంచిగుణము. రజస్సు, తమో గుణములు చెడ్డ గుణములు. అనగా ఆ మనుష్య శరీరములో అన్ని గుణములు ఉన్నవనియే అర్థము. గీతలో కూడా ప్రకృతియే మాయ యనియు, ప్రకృతి త్రిగుణములు అనియు, మాయ కలవాడే ఈశ్వరుడనియు, అట్టి ఈశ్వరుడు అవతరించినప్పుడు మాయ సహితుడై యుండుననియు చెప్పుచున్నది. ఈ మాయ సత్వ గుణమేనని చెప్పుట సరికాదు. త్రిగుణమయమైన ఈ బ్రహ్మాండమంతయు అవతార పురుషుని యొక్క పిండాండములో ఉన్నట్లుగా విశ్వరూప ప్రదర్శనమున స్పష్టమగుచుండగా అవతార పురుషునిలో త్రిగుణములు ఉన్నవి అనియే అర్థము. ఈ రజస్తమో గుణములు కూడా అవతార పురుషుని క్రీడలోను, మరియు భక్తులను పరిక్షించుటలోను ఉపయోగపడుతుంది. శ్రీ రాముడు సహితము జాబాలిని కోపగించుట అను రజోగుణమును, బంగారు లేడిని వెంబడించుట అను తమోగుణమును కలిగియున్నాడు. ఈ గుణముల వల్లనే దత్తుడు కోపముతో యున్న చండలాది రూపములలో కనబడుచుండును, అయితే ఈ త్రిగుణ మాయ అవతారపురుషుని వశములోయుండును. కావున అతడు వశీకృతమాయుడు. దత్తుని యొక్క ఆరు చేతులు, స్వీకరించిన మనుష్య శరీరము పుట్టుక మొదలగు ఆరు వికారములను కలిగియే ఉండునని సూచించుచున్నది. శంఖము, ఢక్క శబ్ధమును, జపమాల వాక్యమును సూచించగా ఆయన జ్ఞానమున బోధించుట చెప్పుచున్నది. చక్రము, శూలము శక్తితోనున్న మంత్రజలముకల కమండలము ఆయన యొక్క శక్తి మంతములైన సిద్ధులను చెప్పుచున్నవి. మొదటి మూడును ప్రధాన దక్షిణార్ధమగు గురు స్వరూపమును, రెండవ మూడును వామార్ధమగు భగవత్స్వరూపమును మనుష్యావతారమున ఉండునని చెప్పుచున్నవి. కావున త్రిముఖ షడ్భుజ దత్తుడు అనగా త్రిగుణములతోయున్న మాయా మానవఆవతార పురుషుడేనని తాత్పర్యము. అట్టి అవతార పురుషుని సేవించక దత్తచిత్రములను, శిల్పములను సేవించి ప్రయోజనమేమి? శిలావిగ్రహములు కేవలము ప్రతీకలే అనగా ప్రతినిధులే. ''ఆదిత్యం బ్రహ్మేతి'' అను శ్రుతి సూర్య మండలమును పరమాత్మగా ధ్యానించమని చెప్పగా, మందమతులు, సూర్యుడినే పరమాత్మయని భావించినారు. అందుకే వేదము"నేదంతత్'' అని మరల యీ జడగోళము అగు సూర్యమండలము పరమాత్మకాదని బోధించినది. విగ్రహములు దర్శన, ధ్యాన యోగ్యములే కాని నైవేద్యాది సేవా యోగ్యములు కావు. త్రివర్ణ పతాకము భారతదేశ ప్రతీక. అనగా ఆ పతాకము భారత దేశము కాదు. భారత దేశమును సూచించు ప్రతినిధియే. ఇక గోవు విషయము. దత్తుని వెంట గోవు వచ్చుచున్నది. ఆవు ధర్మదేవత యొక్క రూపముగా చెప్పబడుచున్నది. దీనిలోని అంతరార్థము ఏమనగా ఆయన నడకను ఆవు అనగా ధర్మము వెంబడించుచున్నది కాని ఆయన ధర్మమును అనగా ఆవును వెంబడించి నడచుటలేదు. అనగా ఆయన నడచిన మార్గమే ధర్మమని అర్థము. ఆయన గోపాలుడు అనగా ధర్మ రక్షకుడు. ఆయనచే రక్షింపబడు ధర్మము కన్న ధర్మమును రక్షించు ఆయనయే గొప్పవాడు.
కుక్కలు: అట్లే ఆయన పాదముల వద్ద వేదములు కుక్కలుగా పడియున్నవి. పాదములు అనగా ఆయన శ్లోక రూపముగా బోదించుచున్న జ్ఞానములో శ్లోకములోని నాలుగు పాదములు అను అర్థముతో ఆ నాలుగు

పాదములను అనుసరించి వేదములు ఆయనపై ఉండవలసిన స్థిర విశ్వాసమునకు ప్రతీకలుగా నిలచియున్నవి. అనగా ఆయన చెప్పు జ్ఞానవాక్యములను వేదములే అనుసరించుచున్నవి. అనగా ఆయన చెప్పిన ప్రతిమాటయు వేదమే అని అర్ధము. పండితులు వేదమును అనుసరించి వాక్యములను పలికెదరు. ఆయన వేదకర్త వేదము ధర్మమూలము. కావున ఆయన చెప్పినది వేదము. ఆయన చేసినది ధర్మము అని తాత్పర్యము. ''అస్య మహతో భూతస్య వేదోఖిలో ధర్మమూలం'' అను ప్రమాణములు ఆయన వేదకర్తయనియు, వేదము ధర్మమూలము అని చెప్పబడినది గదా.

అవతార పురుషుడు జ్ఞానబోధ చేయునప్పుడు మామూలు స్థితిలో ఉన్నట్లుగాను, మహిమలను చేయుచున్నప్పుడు ఎక్కువ శక్తితో చేరి ఉన్నాడని మీరు తలచుట చాలా పొరపాటు. అవతారపురుషులు జ్ఞానబోధ చేయునప్పుడు పరిపూర్ణమైన పరమాత్మతో పూర్ణశక్తితో చేరియున్నాడు. అట్టి స్థితిలో అవతార పురుషుడు 100 వాట్స్ బల్బుతో సమానము. మహిమలను చేయునప్పుడు అత్యల్ప శక్తితో కూడిన '0' వాట్స్ బల్బువలెయుండును. కావున క్షుద్ర జనులు కూడా ఆ సిద్ధులను సాధించగలుగుచున్నారు. కాని బ్రహ్మజ్ఞానమును సాధించుటలేదు. శ్రీ కృష్ణుడు కౌరవులకు బోధ చేయునప్పుడు మరియు అర్జునకు బోధ చేయునప్పుడు పరిపూర్ణమైన విశ్వరూప స్థితిలో నున్నతన స్వరూపమును చూపినాడు. కావున జ్ఞానబోధ చేయునప్పుడు పరిపూర్ణమైన శక్తి స్వరూపుడైన పరమాత్మయే చేయగలడు. కేవలము గ్రంథస్థమైన జ్ఞానమును బోధించు పండితులు కూడా '0' వాట్స్ బల్బుల వంటివారే. కావుననే పరమాత్మ చెప్పు జ్ఞానము ప్రజ్ఞానమని ''ప్రజ్ఞానం బ్రహ్మ''అని వేదము చెప్పుచున్నది. ప్రజ్ఞానము అనగా జీవులకు సాధ్యము కాని ప్రకృష్టమైన అనగా అతి విశేషమైన జ్ఞానము అని అర్ధము. ఇట్టి ప్రజ్ఞానము చేతనే పండితులగు గురువుల నుండి సద్గురువగు అవతార పురుషుని వేరు చేయవలయును. సత్ అనగా పరబ్రహ్మము. సద్గురువు అనగా గురుస్వరూపమున ఉన్న పరబ్రహ్మము అని అర్ధము. అజ్ఞానము పతన కారణము మరియు అమితమైన బలము కలది. జ్ఞానము ఉద్ధరణ కారణము అనగా క్రింది నుండి పైకిపోవుట. దానికి బలము తక్కువ. అజ్ఞానము స్వభావ సిద్ధమైనది. కావున బోధించు ప్రయత్నమక్కరలేదు. నీరు స్వభావ సిద్ధముగాఎంతో వేగముతో పై నుండి క్రిందకు పడి పతనము చెందును. అదే క్రింద పడిన నీరు స్వయముగా పైకి పోవుటకు వేగము కలిగియుండదు. దానిని పైకి తెచ్చుటకు ఎంతో బాహ్యప్రయత్నము అవసరము. అట్లే అజ్ఞానులను ఉద్ధరించుటకు సద్గురువు ఎంతో శ్రమ పడుచుండును.

శిలా విగ్రహములకు తైలాభిషేకము చేసి తైలము వ్యర్ధము చేయుచున్నారు. నరాకారములో వచ్చిన సద్గురువు అగు పరమాత్మ యొక్క తలకు తైలము అంటుటయే నిజమైన తైలాభిషేకము. విగ్రహములు కేవలము దర్శన యోగ్యములే. వాటిపై దుమ్ముపడకుండా నీటితో కడిగి శుభ్రపరచుట అను స్నానోపచారము ఒక్కటి చేసిన చాలునని చెప్పియే యుంటిని గదా! పరమాత్మ మానవ శరీరమును ఆవహించి అవతరించును. విద్యుత్ తీగెను ఆశ్రయించి వ్యాపించి యున్నది కదా. కనక తీగెను ఎచ్చట ముట్టుకున్నను షాకు కొట్టుచున్నది. కావున విద్యుత్తును తీగెను వేరు చేయలేము. విద్యుత్తే తీగె, తీగెయె విద్యుత్తు. అయితే ఇంత మాత్రమున విద్యుత్ తీగెగా

మారలేదు. విద్యుత్ పోయిన తర్వాత తీగెను ముక్కలు చేసినను విద్యుత్ ముక్కలు కాలేదు. ఇదేవిధముగా పరబ్రహ్మము మానవ శరీరమును ఆశ్రయించి శ్రీకృష్ణునిగా అవతరించిది. పరబ్రహ్మము మానవ శరీరమును ఆపాదమస్తకము వ్యాపించియున్నది. "అంతర్బహిశ్చ తత్సర్వం" కావున శ్రీకృష్ణుడే పరబ్రహ్మము, పరబ్రహ్మమే శ్రీకృష్ణుడు. ఐతే శ్రీకృష్ణుని నిర్యాణ సమయమున పరబ్రహ్మమైన నారాయణుడు శ్రీకృష్ణుని శరీరము నుండి నిష్క్రమించగా ఆ కృష్ణుని శరీరమునకు పార్థుడు దహనసంస్కారము చేసెను. ఇంత మాత్రమున దానిచేత నారాయణుడు దహింపబడలేదు. ఏలననగా నారాయణుడు నర శరీరమును ఆశ్రయించినాడే కాని నారాయణుడు నరునిగా మారలేదు. ఇది తెలియక అజ్ఞానులు నారాయణుడు మరణించెను, దహింపబడెను అని తలచెదరు. ఈ విషయమే గీతలో "మానుషీం తనుమాశ్రితమ్" అనగా పరమాత్మ మనుష్య శరీరమును ఆశ్రయించి అవతరించును. వేదములో చెప్పినట్లు "అవ్యక్తం వ్యక్తమాపన్నం" అనగా పరమాత్మ నరశరీరముగా మారి అవతరించినాడు అని ఆజ్ఞానులు తలచెదరు. కావున శ్రీకృష్ణుడు జీవించినంత కాలము సాక్షాత్తు నారాయణుడే కాని నిర్యాణానంతరము శ్రీకృష్ణ శరీరము మామూలు నరశరీరమే.

## భారతదేశము ఎప్పుడునూ దారిద్ర్యముతో బాధపడుచున్నది. ఎందువలన?

భారతీయ పండితులు కర్మఫలత్యాగమును యుక్తులతో చేసినట్లు నటించుచున్నారే కానీ కర్మఫల త్యాగమును చేయుటలేదు. పరీక్షకు పేపరు, పెన్నువలె ఈ పరీక్షకు కర్మఫలమగు ధనము, నరాకారమున ఉన్న స్వామి కావలయును. ఆహారమును విగ్రహమునకు చేయి చూపించి దానిని ప్రసాదముగా తీసుకొనుటలో స్వామి ఒక్క మెతుకు కూడా తినలేదు. మరియొక్క అతి తెలివి ఏమనగా మానవుడు ఆహారమును భుజించి మానవుడే మాధవుడు కావున మాధవుడే భుజించినట్లుగా భావించుచూ స్వామికి కర్మఫలత్యాగమును చేసినట్లుగా పలుకుచున్నాడు. ఇట్టి అతితెలివి మార్గములలో కర్మఫలము నిజముగా వారి వద్దనే ఉన్నది. ఈ విధముగా భారతీయ పండితులు తమ లోభమును అతి తెలివితేటలతో కప్పి పుచ్చినారు. హృదయము ప్రేమతోను, బుద్ధి తెలివి తేటలతోను నిండియుండును. భారతీయులు స్వామికి బుద్ధిలోనున్న తెలివిని, కుటుంభమునకు హృదయములో నున్న ప్రేమను త్యాగము చేసినారు. విదేశములలో వారు కుటుంబమునకు తెలివిని, స్వామికి ప్రేమను ఇచ్చుచున్నారు. ప్రేమ యొక్క ఫలమే కర్మఫలత్యాగము. తెలివియొక్క ఫలములే ధ్యానము, స్తోత్రము మొదలగునవి. ఈ తెలివియే భారతదేశమునకు దారిద్ర్యమును తెచ్చినది. చేతిలోనున్న పేలపిండి గాలికి ఎగిరిపోయినచో దానిని "రామార్పణం" అను స్థాయికి భారతీయుల తెలివి పెరిగినది. విదేశీయులు సంపాదించి అనుభవించి మిగిలిన దానిని త్యాగము చేయుచున్నారు. వారు తమ పిల్లలను వయస్సు రాగానే సంపాదించి జీవించమని బయటకు పంపుచున్నారు. భారతదేశములో ఉన్న కుటుంబ బంధములకన్ననూ విదేశములలో ఉన్న కుటుంబ బంధములు చాలా బలహీనమైనవి. కావున

విదేశీయులహృదయములలో కుటుంబ బంధముల ద్వారా కారిపోని ప్రేమ ఎక్కువగా మిగిలియున్నది. వారు భగవంతుని గురించి తెలియగనే ఆ ప్రేమ అంతయును విజృంభించి స్వామి మీదకే మరలించబడుచున్నది. వారి కర్మఫలత్యాగము పూర్ణము కావున త్వరగా స్వామిని చేరుకొనుచున్నారు. వారి బుద్ధులు నేరిగా ఉన్నవి. కావున కనీసము పిల్లలకు సైతము దాచుట లేదు. కావున వారి దేశములను సంపన్నదేశములుగా స్వామి అనుగ్రహించినారు. భారతదేశములో ఎంత జ్ఞానము వర్షించినా ఇంకి పోవుచున్నదె కాని ఆచరణలో ఉపయోగించుటలేదు. విదేశములలో గట్టి నేలపై వర్షించిన వాన నదివలె ప్రవహించినట్లు జ్ఞానము అందరికీ ఉపయోగపడుచున్నది. సైన్సులో కూడా విదేశీయులు ఆచరణమునకు ప్రాధాన్యతను ఇచ్చుచుండ భారతీయులు మేథాశక్తితో చర్చలతో గడుపుచున్నారు. ఈ స్వభావము అధ్యాత్మిక సంప్రదాయము నుండి భారతీయులకు సంక్రమించినది. అందుకే భారతదేశమును స్వామి అపార మేథా శక్తితోను, విదేశీయులను అపార ధనములతోను అనుగ్రహించినారు. "ఎవరు ఎట్లు నన్ను సమీపింతురో వారిని అట్లు సమీపింతును" అని గీతా వాక్యము.

ఈ పూర్ణిమ పూర్ణ చంద్రుడు ధనమును, మనస్సును సూచించును. కావున నీ పూర్ణ ప్రేమను కర్మఫల త్యాగము ద్వారా పూర్ణ విశ్వాసముతో కూడిన మనస్సుతో సద్గురువునకు గురుదక్షిణగా ఇచ్చుటయే. పూర్ణిమ నాడు దత్తుడు సాక్షాత్కరించినందున ప్రతి పూర్ణిమ నాడు మీరు గురుదక్షిణ ద్వారా కర్మఫలత్యాగము చేయవలెను. కాని గురువుకు ప్రదక్షిణములను చేయుట కాదు. భారతీయులు తప్పుదిద్దుకొని కర్మఫలత్యాగమును నేర్చుకొని తమ దేశమును సంపన్న దేశముగా స్వామి అనుగ్రహముద్వార సాధించవలయును. భారతీయుల ఆధ్యాత్మిక కేంద్రములు సైతము విదేశ ధనముల ద్వారానే వృద్ధి చెందిన విషయము స్పష్టమే కదా. స్వామి వివేకానందుదు "ఇంత జ్ఞానముతో ఉన్న నా భారతదేశము ఇంత దారిద్ర్యముతో ఏల భాధపడుచున్నది?" అని పెద్దగా ఏడ్చినాడు. దానికి స్వామి ఇచ్చు సమాధానమే ఇది.

శ్రీ దత్తుని పాదముల వద్దనున్న కుక్కలు కాపలా పనిని చేయుచూ కర్మ సంన్యాసమును చూపుచున్నవి. గోవు తన దూడను సైతము వదలి తన పాలను దత్తునికి ఇచ్చుచూ కర్మఫలత్యాగమును చేయుచున్నది. కర్మఫల త్యాగముతో కూడిన కర్మసంన్యాసమే కర్మయోగము. కేవలము కర్మసంన్యాసము కన్ననూ కర్మయోగమే గొప్పదని గీత. "తయోస్తు..." అని చెప్పుచున్నది. అనగా సద్గురువు చేయు జ్ఞాన, భక్తి ప్రచారమునకు చేయు సేవయే కర్మయోగము. ఇదే కేవలము దత్తుని చేరు మార్గము. యోగ వాశిష్టములో శ్రీ రాముని ముందు ధనమునార్జించి గురుదక్షిణ తెమ్మని వసిష్టుడు ఆదేశించినాడు.

"గురుసాక్షాత్పరబ్రహ్మ" గురువు అనగా సద్గురువగు "శ్రీ దత్తుడే". బిక్షల ద్వారా, గురుదక్షిణల ద్వారా నిరూపించబడిన నీ భక్తికి సంతసించి, అతడే నీ పాపములను, నీ భక్తికి తగు ప్రమాణములో గ్రహించి నిన్ను ఈ లోకములో సుఖముగా ఉంచి సాధన చేయించగల సమర్థుడు. సాయి తనకు సమర్పించు రొట్టెలు వారి పాపములు అని చెప్పినారు. పేదవాడు ఇచ్చు రూపాయి గురుదక్షిణ ధనికుని లక్షలతో సమానము.

సద్గురువువలె జీవుడు సమర్థుడు కాడు. ప్రాచీన కాలంలో పండితులు ఎవరి ఇంటనూ భుజించుట కాని, దక్షిణలను స్వీకరించుట కానీ చేసెడివారు కారు. (అపరిగ్రహ వ్రతము). ఇందుకె ఈ రెండింటికీ అవకాశము కల పౌరోహిత్యమును తప్పని సరికానిచో చేయుటకు ఇష్టపడెడి వారు కాదు. తన పాపములతోనె సతమతమగుచుండగా ఇతరుల పాపములను స్వీకరించి అనుభవించగల ఓర్పు, శక్తి జీవులకు ఉండదు. కావున ఒకరి ఇంట భోజనము చేయక వైశ్వదేవమును పాటించెడివారు. అందుకే భోజనము, బహుమానములను గుర్తుంచుకొని మరల చెల్లించుచుందురు.

సద్గురువు దక్షిణలను, మరల జ్ఞాన, భక్తి ప్రచారములకు దరిద్రులగు భక్తులకు సాయపడుటలోను ఉపయోగించి లోకకళ్యాణమునకే పాటుపడును. మరియు సద్గురువు బిక్షలద్వారా పొందిన అన్న శక్తిని కూడా జ్ఞాన బోధలోనే ఖర్చు చేసి జీవులను ఉద్ధరించును. ఇట్టి త్యాగము వలన దత్తుడు అను శబ్దము స్వామి సార్థకమైనది.

## విశ్వమత సమన్వయము

### స్వామి మరియు క్రిస్టియన్ ఫాదర్ మధ్య జరిగిన సంభాషణ

ఒకసారి స్వామి నరసరావుపేట-విజయవాడ రైలులో ప్రయాణించుచున్నారు. ఒక క్రిస్టియన్ మతస్థుడైన ఫాదర్ కూడా స్వామితో ప్రయాణించుచున్నారు. స్వామి మరియు ఫాదర్ మధ్య జరిగిన సంభాషణ:

**ఫాదర్**: నాయనా విను, క్రీస్తును నమ్మి ఆరాధించని వారు శాశ్వత నరకమున పడిపోవుదురు. ఇది మా మత ధర్మము.

**స్వామి**: క్రీస్తు పుట్టక ముందు జీవులకు ముక్తిలేదా? దేవునకు, ఆ తరముల వారికి ఈ అవకాశమును ప్రసాదించని కారణమున పక్షపాతము వచ్చినది గదా! అనగా క్రీస్తు ముందు తరముల వారిని నిష్కారణముగా అనుగ్రహించకపోవుట తప్పుకదా!

**ఫాదర్**: క్రీస్తు పూర్వము యెహోవా పేరుతో దేవుడున్నాడు. కావున దేవునకు ఈ నింద రాదు. యెహోవాను ఆరాధించిన వారు కూడా పరలోకమునకు పోవుదురు.

**స్వామి**: మంచిది. అయితే ఈ భారతదేశమునకు యెహోవాను గురించి కాని, క్రీస్తును గురించి కాని వాస్కోడిగామా ఇండియాకు రాకముందు ఏమీ తెలియదు. మరి ఈ భారతదేశమున వాస్కోడిగామా రాకముందున్న జీవులందరును నిష్కారణముగా అన్యాయముగా నరకమునకు పోయినారు. వారికి

యొహోవా క్రీస్తుల గురించి తెలియకపోవుట వారి తప్పుకాదు. తెలిసి ఆరాధించకపోయినచో వారి తప్పు ఒప్పుకొనవలసినదే. వారికి భగవంతుడు యొహోవా, క్రీస్తుల గురించి తెలియచేసి ఉండవలెను. అనగా ఒక చిన్న దేశమునకే కాక, అన్ని దేశములనున్న సర్వజీవులకు యొహోవా, క్రీస్తుల గురించి ఏల తెలియబడలేదు? ఒకేసారి కేవలము ఒక దేశమునకే యొహోవా, క్రీస్తుల గురించి ఏల పరిమితమైనది? ఆ దేశము వారికి అవకాశము ఇచ్చుట దేవుని పక్షపాతముకదా? మీ సిద్ధాంతమున జీవునకు పునర్జన్మ లేదు. కావున భారతదేశమున ఆనాటి తరములందరును యొహోవా, క్రీస్తుల గురించి తెలియక అన్యాయముగా నరకమున పడినారు! పోనీ మరల భూమిపై జన్మించి యొహోవా, క్రీస్తుల గురించి ఇప్పుడు తెలుసుకొను అవకాశము కూడా లేదుకదా. ఏలననగా వారికి పునర్జన్మ లేదు కదా! కావున మీ వాదము దేవునకు పక్షపాతము అంటకట్టుచున్నది అనుట నిస్సంశయము.

**ఫాదర్**: సరే దేవుడు పక్షపాతము కలవాడన్న వాదము మీ మతమునకు అంటక తప్పదు. ఏలననగా మీరు నారాయణుడు, కృష్ణుడు తెలియనివారు నరకమున పడుదురని వాదించుచున్నారు గదా. విదేశములకు పాత కాలములో నారాయణ,కృష్ణుల గురించి తెలియ నరకమున పడినందున మీ దేవునకు గూడ పక్షపాతము వచ్చినట్లే గదా!

**స్వామి**: మంచి ప్రశ్న వేసినావు. క్రీస్తు, యొహోవాల గురించి తెలియని వారు నరకమున పడుదురనువారు వీర క్రైస్తవులు. అలానె కృష్ణుడు, నారాయణుడు గురించి తెలియని వారు నరకమున పడుదురన్న మా హిందువుల శాఖ వారు వీర వైష్ణవులు. ఈ రెండు మతముల వలే వీర శైవులునూ ఉన్నారు. వీరు శివుని ఆరాధించకపోయిన నరకప్రాప్తియని వాదింతురు. హిందూ మతములో వీరశైవ, వీరవైష్ణవ మతములవారు ఇట్లే కలహించుకొనుచున్నారు.హిందూ మతము ఒక చిన్న విశ్వముగా ఉన్నది. హిందూ మతములోని అవాంతర మతములగు శైవ, వైష్ణవ మతములలోనే ఏకత్వమును చూడలేని వారు, ప్రపంచ మతములలో ఏకత్వమును చూడగలరా? ఇంటిలోని గోడలను పగులకొట్టి, ఇల్లు మొత్తము ఒకే హాలు చేయలేని వారు, ఇండ్ల మధ్యగోడలను పగులకొట్టి అన్ని ఇళ్ళను ఒకే ఇల్లు చేయగలరా? కావున ఈ వీర మతములన్నియు దేవునకు పక్షపాతమును తెచ్చుచున్నవి.

కానీ, దేవుడు నిష్పక్షపాతియని నిరూపించుటకు ఒకే ఒక మార్గమున్నది. అది ఏమనగా-- అన్ని కాలములందును, అన్ని దేశములందును, ఒకే దేవుడు భిన్న రూపములతో వచ్చి, ఒకే జ్ఞానమును బోధించి యున్నాడు. కావున, ఆ జ్ఞానమును అనుసరించినవారు అన్ని కాలముల, అన్ని దేశములాలో ముక్తులగుచున్నారు. అనుసరించని వారు అన్ని కాలముల, అన్ని దేశముల నరకమున పడుచున్నారు. చూడండి! ఈ సిద్ధాంతములో దేవుడు నిష్పక్షపాతియని నిరూపించబడుచున్నాడు. ఇంతకన్న వేరు మార్గము లేదు. కావున, నీ దేశకాలములకు సంబంధించిన నీ మతములో నీవు ప్రయాణము చేయుము. తప్పక లక్ష్యము

చేరుదువు. పరమతమును విమర్శించవద్దు. నీ మతమును ఇతర మతస్థులపై రుద్దవలదు. అది మతాహంకారము అగును. నీవు తలవంచుకొని, పక్క మతములవైపు చూడక నీ మతమున ప్రయాణించినచో నీవు తప్పక దేవుని చేరుదువు. అన్ని నదులూ, సముద్రమునే చేరును. ఒక నది "నేనే సముద్రమును చేరుచున్న ఏకైక నదిని" అని అహంకరించినచో, దేవుడు ఆ నదికి అడ్డముగా ఆనకట్టను కట్టించును. ఆ నదితప్ప, ఇతర నదులన్నియును సముద్రమును చేరును! నీవు నీ మతములో ముందుకు పోతే లక్ష్యమును చేరగలవు. అట్లుకాక అడ్డముగా పరమతంలోకి పోతే, ఆ మతంలో లక్ష్యము నుండి అదే దూరములో ఉంటావు. నీ మతమును స్తుతించుము. కాని ఇతర మతమును నిందించకుము. దేశ కాల భేదము వలన భాషా వ్యవహార సంస్కారములు మారుచున్ననూ, మానవుడు ఒక్కడే. అలానే అన్ని దేశములందు అవతరించిన అవతారములలో కూడా దేశ కాల భేదము కనిపించిననూ, దేవుడు ఒక్కడే. అలానే దేవుని చేరు మార్గములైన మతములలో -- క్రీస్తు ఎలా భక్తుల పాపములను తాను భరించి, జీవులకు పుణ్య ఫలములనిచ్చు దయామయుడో అలానే కృష్ణుడు కూడా, కుచేలుని పాప ఫలమగు దారిద్ర్యమును తాను తీసుకొని, తన సంపద నంతయును భక్తుడగు కుచేలునకు ఇచ్చుటకు సిద్ధపడ లేదా? "అహంత్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి - అనగాఅ మీ పాపములనన్నింటి నుండి మీకు విముక్తినిచ్చుచున్నాను." అని అనలేదా? కావున క్రీస్తు అయినా, కృష్ణుడు అయినా ఆ కరుణాతత్త్వము ఒక్కటే.

దత్తావతారములన్నియును భక్తుల పాపకర్మఫలములను ఆకర్షించుకొని తాము అనుభవించి, భక్తులకు సౌఖ్యమును కలిగించుట అందరూ చూచుచున్నారు కదా! (స్వామి తన భక్తుల రోగములను ఎన్నిసార్లు తనపై ఆకర్షించుకొని అనుభవించుట, స్వామి భక్తులమైన మనము ఎన్నిసార్లు చూడలేదు?)

ప్రతి మతములోను జీవులు వివిధ స్థాయిలలో ఉన్నారు. ఆ స్థాయిలననుసరించి, ఆ మతములోనే వివిధ బోధలున్నవి. ఆంధ్రలో, స్కూల్, కాలేజీ స్థాయిలలో సిలబస్ లు తెలుగులో ఉన్నవి. తమిళనాడులో అదే స్కూల్ కాలేజీ సిలబస్ లు తమిళములో ఉన్నవి. రెండు రాష్ట్రములలోను స్కూల్ సిలబస్ ఒక్కటే. అలానే కాలేజీ సిలబస్ కూడా ఒక్కటే. ఏ రాష్ట్ర విధ్యార్థి అయినా స్కూల్ విధ్యార్థి కన్నా కాలేజీ విధ్యార్థి గొప్పయగును. అలానే, నీవు ఏ మతస్థుడవైననూ నీవు స్కూల్ స్థాయిలో ఉన్నావా? లెక కాలేజీ స్థాయిలో ఉన్నావా అనునది ముఖ్యము. తెలుగు స్కూల్ విధ్యార్థి, తమిళ కాలేజీ విధ్యార్థి కన్నా గొప్ప కాదు. రెండు భాషలు సమానమే. అయితే స్కూల్ సిలబస్ కన్నా కాలేజీ సిలబస్ గొప్పది. తమిళ స్కూల్ విధ్యార్థి తెలుగు స్కూల్ లో చేరినంత మాత్రమున గొప్పవాడు కాదు. కావున నీ మతమును మార్చుకొనుట కాదు. నీ మతములో పై స్థాయికి పొమ్ము. అప్పుడు గొప్పవాడగుదువు. నీ తమిళ భాషలోనే స్కూల్స్, కాలేజీ రెండూ ఉన్నవి. నీవు తెలుగు మీడియంకు మారనక్కరలేదు. అలానే ప్రతి మతములోను ఆది నుండి అంత్య స్థాయి వరకును జ్ఞానమున్నది. ఈ సత్యమును తెలియక పోవుటయే అజ్ఞానము. ఇదే మత ద్వేషములకు మూలమై

ఇహలోకములో సుఖముగా ఉండుటకే అడ్డుగా మారుచున్నది. ఇట్టివారు పరలోక సుఖమును పొందుదురా! "ఉట్టికెక్కలేనివారు స్వర్గమునకు ఎక్కగలరా?"

ఈ సంభాషణము జరిగిన తరువాత ఆ ఫాదరు లేచి స్వామికి నమస్కరించి ఆశ్రునయనాలతో ఇలా అన్నారు. "క్రీస్తు మరల వచ్చును అన్నమాట నేడు సత్యమైనది. క్రీస్తు తప్ప ఎవరును ఇలా బోధించలేరు". స్వామి ఇంటికి రాగానే "చూశారా! అతడెంత విశాల హృదయుడో అన్ని మతములలోను మంచి వారున్నారు. అట్టి వారి కొరకే నా యీ జ్ఞాన ప్రచారము అని వచించారు."

## బ్రహ్మము-జీవుడు-పరమాత్మ

బ్రహ్మము అనగా చాలా గొప్పది అని అర్థము. ఈ సృష్టిలో సృష్టించబడిన పదార్థములలో అన్నింటికన్న గొప్పది చైతన్యము. ఈ చైతన్యమునే "చిత్, చిత్తము, జీవుడు, క్షేత్రజ్ఞుడు, శరీరి, దేహి, ఆత్మ" మొదలగు శబ్ధములచే పండితులు పిలుచుచున్నారు. చైతన్యము అన్నింటి కన్న గొప్పది అగుటకు కారణము జడ పదర్థము చేయలేని కొన్ని పనులను చైతన్యము చేయుచున్నది. చైతన్యము చేయు పనిని బట్టి ఆ చైతన్యము వేరు వేరు పేరులను ధరించుచున్నది. చైతన్యము ఒక వస్తువును తెలియునప్పుడు, మరియు తెలిసిన వస్తువును గుర్తుకు తెచ్చుకున్నపుడు "చిత్తము" అనబడుచున్నది. "చితి సంజ్ఞానే స్మరణేచ" అని శాస్రము. అదే చైతన్యము ఒక విషయమును సంకల్పించి ఇది సరియా, కాదా అని ఊగులాడినపుడు "మనస్సు" అని పిలువబడుచున్నది. "సంకల్ప, వికల్పాకం మనః" అని శాస్త్రం. అదే చైతన్యము ఒక విషయమును గురించి నిర్ణయము తీసుకున్నప్పుడు "బుద్ధి" అని పిలువబడుచున్నది. "బుద్ధి రధ్యవ సాయాత్మికా" అని శాస్త్రము. అదే చైతన్యము "నేను నేను" అను స్ఫురణతో పని చేయునపుడు "అహంకారము" అనబడుచున్నది. చిత్తము, మనస్సు, బుద్ధి, అహంకారము అనబడు చైతన్యక్రియలే అంతఃకరణములు అనబడుచున్నవి. ఎట్లు ఒకే పరమాత్మ సృష్టి, స్థితి, లయములు అను పనులను బట్టి బ్రహ్మ, విష్ణు, శివ నామాలను ధరించినాడో అట్లే ఒకే జీవుడు ఆయా పనులను బట్టి అంతఃకరణముల నామాలతో పిలువబడుచున్నాడు. ఈ జీవుడు లేక చైతన్యము జడము కన్నా ఎందుకు గొప్పది? జడము స్వాతంత్రియము లేక చేతనములగు ప్రాణుల అధీనములో ఉండుచున్నది.

కావున జడము గొప్పది కాదు. అట్లే ఆలోచించుట మొదలగు క్రియలను చైతన్యము చేయగలదు. కాని జడము చేయలేదు. కావున ఈ సృష్టిలో అన్నింటి కన్నను చాలా గొప్పది చైతన్యమే. కావున చైతన్యమును బ్రహ్మము అనవచ్చును. ఐతే ఈ సర్వ సృష్టి కన్నను సృష్టికర్త గొప్పవాడు. కావున చైతన్యము కన్నను సృష్టికర్తయే అధికుడు కావున సృష్టికర్తనే బ్రహ్మము అనవలెను. కావున బ్రహ్మము అనబడు శబ్దము నిజముగా, పరిపూర్ణముగా సృష్టికర్త యందే ప్రయోగించవలయును. కాని సృష్టికర్తను వదలివేసి కేవలము సృష్టినే అనగా సృష్టి పదార్థములనే విచారించినపుడు చైతన్యమునే బ్రహ్మము అనవలయును. సృష్టికర్త ఇంద్రియములకు గాని,

మనస్సు, బుద్ధి మొదలగు అంతఃకరణములకు గాని, తర్కమునకు గాని, అందని వాడు. సృష్టికర్తను గురించి ఇప్పటి వరకు దేవతలు ఋషులు వేదశాస్త్రములను చర్చించి చర్చించి ఆయనను గురించి తెలుసుకున్నది ఏమనగా ఆయన గురించి ఏమియు తెలుసుకొనలేము అనియే. నచికేతుడు బ్రహ్మమును గురించి బోధించమని యమధర్మరాజును అడుగగా ఆయన ఈ విధముగా చెప్పి ఆ దేవతలలో ఒకడనైన నేను మాత్రము బ్రహ్మమును గురించి ఎట్లు తెలియగలను అని తన సుదీర్ఘోపన్యాసమును ముగించినాడు. మన బుద్ధి ఆకాశతత్వమును ఆక్రమించలేదు. ఆకాశము అనగా శూన్యమైన ఖాళీ స్థలము. ఈ ఆకాశమును పరమాత్మ సృష్టించెను అని "ఆత్మనా ఆకాశ సంభూతః" అని శ్రుతి చెప్పుచున్నది. ఆకాశతత్త్వమునకు లోబడి మన బుద్ధులు ఆకాశతత్వమును అతిక్రమించి ఆకాశమునే సృష్టించిన పరమాత్మను ఎట్లు ఊహించగలవు? కావున సృష్టికర్త మనకు ఏ విధముగను చిక్కుటలేదు. ఇటు వంటి సమయమున సృష్టికర్త చాలా గొప్పవాడు అని చెప్పుట హాస్యాస్పదమగును. కావున మన బుద్ధికి అందు సృష్టి పదార్థములలో ఏది అత్యధికమగు గొప్పదో దానినే బ్రహ్మమనుట తప్ప వేరు గతిలేదు. కావున చైతన్యమును బ్రహ్మముగా ఆచార్యులు ముగ్గరు అంగీకరించి యున్నారు. ఎవరి బుద్ధికిని అందనిదిని, ఏ ఆచార్యుడును బోధించలేడు. బుద్ధికి అందిన విషయములతోనే బోధించవలయును. గురువు గారు "పరమాత్మ ఉన్నాడు" అన్నారు . శిష్యుడు "పరమాత్మ అంటే ఎవరు" అని అడిగినాడు. "నాకు తెలియదు, నీకు తెలియదు" అట్టి వాడే పరమాత్మ అని గురువు చెప్పినచో, శిష్యుడు "ఐతే నేను మీ నుండి వినవలసినది ఏదియు లేదు" అని లేచిపోవును. ఇది గురుసాంప్రదాయ విరుద్ధము. ఒకనికి అరుంధతి నక్షత్రమును చూపుచున్నాము. ఆ నక్షత్రము కనపడుటలేదు. అప్పుడు వశిష్ఠ నక్షత్రమును చూపి దానికి దగ్గరగా ఉన్న నక్షత్రమే అరుంధతి అని చెప్పుదురు. దీనినే అరుంధతి వశిష్ఠ న్యాయమందురు. అదే విధముగా పరమాత్మను గురించి బోధించవలసి వచ్చినప్పుడు పరమాత్మకు అతి దగ్గరగా పోలికలు ఉండు సృష్టి పదార్థమును చూపించి దాని వంటిదే పరమాత్మయని చెప్పవలసివచ్చును. అయితే అన్ని విషయములలోను పరమాత్మతో పోల్చదగిన వస్తువు సృష్టిలో లేనేలేదు. "నతస్య ప్రతిమా" అని శ్రుతి ఇదే చెప్పుచున్నది. ఒక వస్తువును మరియొక వస్తువుతో పోల్చినప్పుడు ఎక్కువగా పోలికలు ఉండునే తప్ప అన్ని పోలికలు సమానము కావు. అన్ని పోలికలు సమానమే అయినచో ఆ వస్తువు ఆ వస్తువే అగును. చంద్రుని వంటి ముఖము అన్నాము. చంద్రుని వలె ఆహ్లాదముగ యున్నది ముఖము అని అర్థము. ఇచ్చట ఆహ్లాద గుణము నందే పోలిక గాని మిగిలిన గుణములందు పోలిక లేదు.

చంద్రునకు ఉదయా స్థమయముల ఉన్నవి. కాని ముఖమునకు లేవు. చంద్రునకు శుక్లపక్షము వృద్ధి, కృష్ణపక్ష క్షీణత్వము ఉన్నవి. అవి ముఖమునకు లేవు. కావున ముఖచంద్రుడు అనగా ముఖమే చంద్రుడు అన్నప్పుడు ఒక్క ఆహ్లాద గుణములోనే ముఖము చంద్రునితో సమానమగు చున్నది. అట్లే చైతన్యము బ్రహ్మము అన్నప్పుడు ఆ రెండింటిలోను సమానగుణము ఏది? ఆ గుణము ఏది అనగా పరమాత్మ చిత్ర విచిత్రమైన జగత్తును సృష్టించుచున్నాడు. అట్లే చైతన్యము కూడా చిత్ర విచిత్రమగు ఊహల జగత్తును సృష్టించుచున్నది. చైతన్యమునకు అనగా చేతనుడగు మానవునకు ప్రొద్దుపోక తన కన్న రెండవ వస్తువు గాని రెండవ వ్యకిగాని

లేనప్పుడు ఎట్లు చిత్ర విచిత్ర ఊహలతో వినోదించునో అట్లే రెండవ వస్తువు లేని అద్వితీయమైన పరమాత్మ చిత్ర విచిత్రములైన ఊహలను సృష్టించి వినోదించెను. ఈ సమస్త లోకములు ఆయన ఊహలే. ఆయన ఊహలలోని ఒక ఊహయే ఈ జీవుడు. కావున జీవునకు ఈ లోకములు ఊహలు కావు. తన ఊహలు మాత్రమే తనకు ఊహలగును గాని పరమాత్మ ఊహలు తన ఊహలు కావు. ఏలననగా, పరమాత్మ ముందు తాను ఒక ఊహయే. అనగా తాను సృష్టిలోని భాగమే. ఈ సృష్టి రెండు భాగములగ యున్నది. ఒకటి జడము లేక అపరాప్రకృతి. రెండవది చైతన్యమగు జీవుడు లేక పరాప్రకృతి. సృష్టి యనగా ప్రకృతియే. ప్ర=శ్రేష్ఠమైన; కృతి=కార్యము అనగా పని అని అర్థము. ఈ సృష్టి పరమాత్మ చేసిన శ్రేష్ఠమైన పని కావున ప్రకృతి అనబడుచున్నది. జీవుడు ఎట్లు వినోదార్థము ఊహాలోకమును సృష్టించుటకు సంకల్పించెనో అట్లే వినోదార్థము పరమాత్మ ఈ జగత్తును సృష్టించుటకు సంకల్పించెను. ఇచ్చట పరమాత్మలోను జీవుడు అనగా చైతన్యములోను సంకల్పము అను క్రియ సమానముగా యున్నది. ఇట్లు సంకల్ప క్రియ, చిత్ర విచిత్రముగా ఊహించు సామర్థ్యము మొదలగు కొన్ని పోలికలు ఉండుట వలన చైతన్యము పరమాత్మయనినారు. సంకల్ప క్రియ ఊహానిర్మాణ సామర్థ్యములను గురించి "సయిదం సర్వమ సృజతా, తదైక్షత్వా" ఇత్యాది శ్రుతులును వినోదార్థము ఊహ సృష్టి "ఏకాకి నరమతే" అను శ్రుతియు చెప్పుచున్నది. ఈ కారణముల వలనే చైతన్యమును బ్రహ్మమన్నామని "ఈక్షతే ర్నాశబ్ధం" అను బ్రహ్మసూత్రము చెప్పుచున్నది. ఇంత మాత్రమున చైతన్యము బ్రహ్మమని భ్రమించరాదు. పోలికలు లేని అంశములు అనేకములు కలవు. చైతన్యము సర్వవ్యాపకము కాదు. కాని పరమాత్మ సర్వవ్యాపకుడు. చైతన్యము అనగా జీవుడు సూర్యప్రతాపమునకు భయపడి శరీరమున విలవిలలాడుచున్నాడు. కాని పరమాత్మ సూర్యునే శాసించు చున్నది. కావున ఇది ముఖచంద్రుని వంటి ఉపమ అను అలంకారమేనని గ్రహించవలెను.